# నిరుత్సాహమును గూర్చి ముక్కుసూటి మాట



భావోద్రేక పోరాటములను దేవుని వాక్యశక్తితో జయించుట

జాయిస్ మేయర్

గతంలో ఈ పుస్తకము *"సహాయము చేయండి! నేను నిరుత్సాహముగానున్నాను"* అను పేరుతో ప్రచురితమైంది

# నిరుత్సాహము గూర్చి

ముక్కుసూటి మాట

# నిరుత్సాహమును గూర్చి

ముక్కుసూటి మాట

**భావోద్రేక పోరాటములను**
**దేవుని వాక్యశక్తితో జయించుట**


# జాయిస్ మేయర్



JOYCE MEYER
MINISTRIES®

Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills, Hyderabad - 500 033

Unless otherwise indicated, all Scripture quotations are taken from *The Amplified Bible* (AMP). *The Amplified Bible, Old Testament,* copyright © 1965, 1987 by The Zondervan Corporation. *The Amplified Bible, New Testament,* copyright © 1954, 1958, 1987 by The Lockman Foundation. Used by permission.

Scriptures marked KJV are taken from the *King James Version* of the Bible.

Originally published as *Help Me I'm Discouraged.*

Copyright © 2018 by Joyce Meyer Ministries - Asia

All rights reserved. No part of this publication may be reproduced, distributed, or transmitted in any form or by any means, or stored in a database or retrieval system, without the prior written permission of Joyce Meyer Ministries - Asia.

Joyce Meyer Ministries - Asia
Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033

Phone: +91-40-2300 6777
Website: www.jmmindia.org

Straight Talk on DISCOURAGEMENT - *Telugu (R1 - 2018)*
*Overcoming Emotional Battles with the Power of God's Word!*

*Printed at:*
Caxton Offset Pvt. Ltd.
Hyderabad - 500 004

# విషయసూచిక


పరిచయం vii

*మొదటి భాగము* – **పీడింపబడుస్థితినుండి విడుదల** 1

1. అందరికంటే గొప్పవాడు మనలో జీవించుచున్నాడు 3
2. మెలకువగానుండి ప్రార్థన చేయండి 9
3. సవాలుతో పనులు జరిగించుటకు
   కావలసిన ఆరు సంగతులు 17
4. నిరాశను పరిష్కరించుట 27
5. యేసుక్రీస్తునందు ధైర్యంతో నమ్మిక కల్గియుండుము 35
6. దేవుని గూర్చిన సంగతులను ధ్యానించండి 41
7. నిరీక్షణ మరియు రాబోవు మేలుల కొరకైన ఎదురుచూపులు 47
8. ఒక నూతన క్రియ 53
9. క్రొత్త ద్రాక్షారసము – క్రొత్త తిత్తులు 61

ముగింపు 67

*రెండవ భాగము* – **లేఖన భాగములు** 69

నిరుత్సాహమును ఎదిరించుటకు తగిన లేఖన భాగములు 70

నిరుత్సాహమును జయించుటకు ప్రార్థన 74

ప్రభువుతో వ్యక్తిగతమైన సంబంధం కొరకు ప్రార్థన 75

రక్షణ కొరకు ప్రార్థన 77

# పరిచయం

మనమందరము ఏదో ఒక సమయంలో నిరాశపడియుంటాము. వారంలో ఒకసారైనా ఏదో ఒక కార్యం, మనం అనుకున్న ప్రకారం జరగాలని నిర్ణయించు కుంటాము. ఆ విధంగా ఆ కార్యము జరుగక పోయినప్పుడు మనం నిరాశతో నిండిపోతాము.

నిరాశ కలిగినప్పుడు సరియైన రీతిగా దాని విషయమై చర్యతీసుకోకపోతే మనకు నిరుత్సాహం కలుగుతుంది. చాలాకాలంగా మనం నిరుత్సాహంలో మునిగితే, పూర్తిగా పాడైపోయిన స్థితిలోనికి జారిపోతాము. అట్టి పాడైన స్థితిలోనున్నప్పుడు ఏ పనిని సంతృప్తికరంగా చేయలేము.

ఈ విధంగా జీవితమనే దారిలో పాడైన స్థితిలో నివ్వెరపోయిన ఎంతోమంది క్రైస్తవులను మనం చూడగలము. వారందరు నిరాశ కలిగినప్పుడు ఎట్లు ప్రవర్తించాలో తెలియనివారే. వారిప్పుడు ఎదుర్కొనుచున్న దౌర్భాగ్యస్థితికి కారణమేమనగా, చిన్న నిరాశ కలిగినప్పుడు దానిని ఎట్లు తమ అంకెకు తెచ్చుకోవలెనో వారికి తెలియలేదు.

యేసు ప్రభువు అపవాదిచేత పీడింపబడిన వారిని స్వస్థపరచెను (అపొ.కా. 10:38). మనము నిరాశపడినస్థితిలో, పాడైనస్థితిలో లేక పీడింపబడినస్థానంలో ఉండుట దేవునికిష్టములేదు. మనము నిరాశపడినపుడు,

తిరిగి చిగిర్చిన ఆశగలవారంగా ఎట్లు తయారు కాగలమో నేర్చుకోవాలి. అప్పుడే మనం నిరుత్సాహం నుండి, పాడైన స్థితినుండి తేరుకోగలము.

బండయైన యేసు క్రీస్తునందు మనం నిరీక్షించినయెడల (1 కొరింథీ 10:4), సాతానును ప్రప్రథమంగానే ఎదిరించుటకు నేర్చుకొనినయెడల, యెహోవా యందలి ఆనందములో ఆయన యొక్క సమాధానంలో జీవించగలము, నిరుత్సాహం నుండి విడుదల పొందగలము.

*మొదటి భాగము*

# పీడింపబడుస్థితినుండి విడుదల

# 1

# అందరికంటే గొప్పవాడు మనలో జీవించుచున్నాడు

"అదేదనగా దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెననునదియే. దేవుడాయనకు తోడై యుండెను గనుక ఆయన మేలుచేయుచు, అపవాదిచేత పీడింపబడిన వారినందరినీ స్వస్థపరచుచు సంచరించుచుండెను."

అపొ.కా. 10:38

యేసు క్రీస్తు ప్రభువు భూలోకమందు జరిగించిన పరిచర్య కాలములో ఆయన యొక్క పిలుపు లేక ఆయన యొక్క వృత్తి ఏమనగా, తనమీదనున్న పరిశుద్ధాత్మ అభిషేకము ద్వారా అపవాదిచేత పీడింపబడిన వారికి విడుదల ప్రకటించుటయే. అదేశక్తి ఈనాడు మనకు అందుబాటులోనున్నది. దేవునిపిల్లలు విసిగించబడుట లేక పీడించబడుట ఆయన చిత్తముకాదు. అటువంటి పీడనుండి మనలను

విడిపించునట్లు యేసు క్రీస్తు శక్తి మనకు ఈ దినాలలో సయితము అందుబాటులో నున్నది.

వెబ్‌స్టర్ వ్రాసిన ఆంగ్ల నిఘంటువులో "పీడింపబడుట" అనుమాటకు "గొప్ప భారమును మోపుట"యన్న అర్థం వ్రాశారు. అందువల్ల మనస్సు మరియు ప్రాణము కృంగిపోతుంది. "అణిచి వేయుట", "బలముతో లోపరచుకొనుట" యను అర్థములు కూడా ఈ మాటకు గలవు.

సాతాను మన మనస్సును లేక ఆత్మను కృంగదీయుట మాత్రమే గాక మన శరీరావయవములలో దేనినైనా లేక ప్రాణము యొక్క ఏ విభాగమునైనా అణచివేయ జూచునని నేను అభిప్రాయపడుచున్నాను. కొన్నిసార్లు మనకు ఎందుకు అట్టి బాధ కల్గుచున్నదోనన్న గ్రహింపు కలుగకుండనే వాడు మనలను వేధిస్తాడు.

కొన్నిసార్లు మనలో ప్రతి ఒక్కరము ఏదో బరువు, భారము మనపైనున్నట్లు అనుభవిస్తాము. అతడు మనలను పీడించినప్పుడు మనం ఆలోచించలేనివారంగా, నిర్ణయాలు తీసికొనలేనివారంగా తయారవుతాము. మరికొన్నిసార్లు మన దేహము మనతో సహకరించనంతగా పీడకు గురియౌతాము.

సాతాను ఆయా సమయాల్లో మనవ్యక్తిత్వంలోని ఆయా భాగాలను, వెవ్వేరు రీతులుగా వెవ్వేరు కారణాలను బట్టి పీడించి తన అదుపులోనుంచుకొనుటకు ప్రయత్నిస్తాడని గుర్తుంచుకోవాలి. యేసు క్రీస్తునుబట్టి సాతానును ఎదిరించుటకు తగిన శక్తి మనకు అందుబాటులోనున్నది. అతని విషయములో మనం ఉగ్రులము కాకపోతే అతడు మన విషయమై ఉగ్రుడౌతాడు.

సమస్త దుష్టత్వమునకు సాతానే మూలము; అయినప్పటికీ మనం శరీరాను సారంగా నడచుకొనుటవల్ల మనకు దుఃఖముతో కూడిన భారం కలుగుతుంది. అది మనలను లొంగదీసి లోపరచుకొంటుంది. చిన్న చిన్న సమస్యలు కల్గినప్పుడు

సయితము మనము లొంగదీయబడతాము. వ్యర్థమైన ముచ్చట్లు చెప్పుచు ఇతరులపై నెపములు మోపుచూ, వారిని గూర్చి తీర్పు తీర్చువారు సయితము ఇదే కోవకు చెందినవారు. అట్టి భారము నుండి తేరుకొని, మనలోనుండి జీవధారలు పైకి ఉబకవలెనంటే మనము అపవాదిని ఎదిరించి, మనలను పీడించువాని మార్గములన్నిటినీ కాలరాయాలి. మనపై వచ్చుచున్న పీడనను, కృంగుదలను అంగీకరించకూడదు. దేవుడు దేనిని మనలను చేయమని ఆజ్ఞాపిస్తాడో దానిని హృదయపూర్వకంగా తప్పక చేయాలి. మనము దేవునికి విధేయులమై సవాలుతో కూడిన ప్రణాళికలను చేపట్టాలి. దేవుడు మనలను దేనిని చేయమని కోరుచున్నాడో దానిని చేయుటకు ఆయన మనకు తప్పక తగిన సామర్థ్యమిస్తాడు.

ఈ సందర్భంగా మరలా మనం వెబ్‌స్టర్ నిఘంటువును చూచినట్లయితే "దండెత్తుట" అన్నమాటకు "బలముతో చేయుకార్యము"; "బలముతో నిండి యుండుట" లేక "ధైర్యముతో నిలదొక్కుకొనుటయన్న అర్థములు చూడగలము." ఈ మాటలు 'సరియైన వాటిని ఊహించుకొనే జ్ఞానము కలిగియుండుట'యను అర్థమిచ్చును.

దేవుడు మానవుని సృష్టించినప్పుడు, అతనికి గల ఊహించుకొనే సామర్థ్యమును దుష్టత్వముతో, చెడుతనముతో నింపలేదు. దానివల్ల నూతన అభిప్రాయములు కల్గి, క్రొత్త సంగతులను కనిపెట్టే తలంపులతో నిండిన కల్పనా చాతుర్యం కలుగుతుంది. పాపములో పడిపోకముందు తన పరిశుద్ధమైన స్థితిలో నున్న ఆదాము సృష్టిలో ప్రతిదానికి పేరు పెట్టుట ఎంత ఆశ్చర్యమో చూడండి. మనలో కొంతమంది మన పెంపుడు కుక్కకు పేరు పెట్టుటకే సతమతమౌతాము.

## దేవుని ఆత్మచే నడిపించబడుట

పరిశుద్ధాత్మయొక్క నడిపింపును అనుసరించుట వల్ల, మన జీవితాల్లో ఆత్మ ఫలములు గలుగున వెలిబుచ్చుట వల్ల (గలతీ 5:22,23), మనం సంగతుల

యొక్క ప్రారంభకులంగాను, నూతనమైన వాటిని కనిపెట్టు వారిగాను ఉండగలము. మనలోనున్న దేవుని యొక్క కల్పనా సామర్థ్యాన్ని ఉద్దేశ పూర్వకంగా బయలుపరచగలము. అణపబడిన స్థితిలో ఉండుటవల్ల అనేకులు విసుగుదల కల్గియుంటారు. కారణము వారు దైవసంబంధమైన ఎదిరించలేని పరిస్థితికి బయటివారుగా నుండుటయే. దేవుడు మనకిచ్చిన సామర్థ్యం వల్ల మనం విసుగుదలను తొలగించుకోగలము.

మనలో కొందరము ఇతరులకంటే ఎక్కువ మంచి సంగతులను ఊహించుకొనే వారంగా, నిర్మాణాత్మకంగా, క్రొత్త విషయాలు కల్పించేవారంగా, చురుకుగా ప్రవర్తించేవారంగా ఉంటాము. అట్టి నిర్మాణాత్మకతను, ఊహించుకొనే స్థితిని, నూతన సంగతులను బయలుపరచే శక్తిని, చురుకుదనంతో వాటిని అమలుపరచే సామర్థ్యాన్ని దేవుడు మనలోని ప్రతీ ఒక్కరిలో ఉంచాడు. కనుక వాటిని ఉపయోగించుకొని మన జీవితములు ఎంతో తృప్తికరమైనవిగాను, ఉపయోగకరమైనవిగాను, ఆనందకరమైనవిగాను చేసికోగలము.

ఏదో ఒకటి మనకు కలుగుతుందిలే అని ఎదురుచూడడానికి బదులు, మనమే సంగతులకు నాంది పలికేవారంగా ఉండగలము. ఉదాహరణకు ఇతరులు మనతో స్నేహించాలని ఎదురు చూడకమునుపే వారికి ముందుగా స్నేహితుల మౌతాము.

## సాతానును మనయొద్దనుండి తరిమివేయండి

అపవాది ఎల్లప్పుడు మనతో అబద్ధాన్నే చెబుతాడు (యోహాను 8:44). మనము అతనిని ఎదిరించక, వాని అబద్ధములకు చెవియొగ్గినవారమైతే, వాడు మన జీవితాలను నాశనం చేస్తాడు. అతడు గర్జించు సింహమువలె వెదకుచు తిరుగుచున్నాడు (1 పేతురు 5:8). అయితే మనలో యూదా గోత్రపు సింహమైన యేసు ఉన్నాడు. కనుక గర్జన మనమే చేయవలసియున్నాము.

అపవాది మనవైపు ఒక అడుగు ముందుకు కదిలితే, మనము ఆత్మీయంగా దానిని గుర్తించి, వాడు చేయతలపెట్టిన కార్యంతోనే వానిని పడగొట్టగలగాలి. వానిపై మనకున్న అధికారమును ఎడతెగక ఉపయోగించుకొంటూ నిలిచి యుండాలి.

ఈ విషయంలో మనము మందులమై ఆగిపోతే వాడు మనపైకి వస్తూనే ఉంటాడు. అపవాది అబద్ధికుడు, విసిగించువాడు, చెడుసంగతులు చెప్పువాడు, మోసగాడు. అతడు సింహమువలె వచ్చును గాని అతడు సింహము కాదు. యేసుక్రీస్తునందు విశ్వసించిన మనలో వానికంటే గొప్పవాడున్నాడు. "....మీలోనున్నవాడు లోకములోనున్న వానికంటే గొప్పవాడు" (1 యోహాను 4:4).

దేవుని వాక్యము బాగుగా ఎరిగియుండండి. ఎప్పుడైతే సాతాను దేవుని వాక్యమునకు వ్యతిరేకమైన తలంపు కలిగిస్తాడో; అదేక్షణంలో "ఓ అబద్ధికుడా! నీమాట నేను వినను" అని వానితో చెప్పండి.

బలముపొందుచూ, సాతానునుండి భద్రపరచుకొనుచూ, వానిని వెనుకకు తరుముచూ మీ జీవితములు జీవించండి.

## జీవమును కోరుకొనుడి

> "నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను మీ యెదుటను ఉంచి, భూమ్యాకాశములను మీ మీద సాక్షులుగా పిలుచుచున్నాను."
>
> ద్వితీ.కా. 30:19

సంతోషంగాని, ఆనందంగాని, మన వెలుపల నుండి వచ్చునవి కావు. అవి మనం జీవించే ప్రతీదినంలో మన మనస్సాక్షినిబట్టి ఎంపికనుబట్టి కలుగు నిర్ణయాలే.

మా పరిచర్యలో సాయంచేసే ఒక యౌవనురాలైన స్త్రీ గలదు. ఆమె తన జీవితాన్ని మార్చుకొనుటకు ఇష్టపడుతుంది. ఎన్నో సవాళ్లు కల్గియున్నప్పటికీ ఆమె సంతోషంగా, ఆనందంగా ఉండగలుగుతుంది. ఆమె అంత సంతోషంగా, ఆనందంగా ఉండడానికి కారణం ఆమె జీవితంలో సమస్యలు లేకపోవడం వల్లకాదు. గాని, తన విరుద్ధమైన పరిస్థితుల్లో సయితము తాను సంతోషంగా ఉండాలని నిర్ణయించుకుంది.

ప్రతీరోజు దౌర్భాగ్యంగా ఉండాలా  లేక యెహోవాయందలి ఆనందంతో నిండియుండాలా అన్న ఎంపిక తాను చేసికొంటుంది.

మన జీవితాల్లో సయితము మనం అట్టి నిర్ణయం తీసికొనవలసియున్నది.

ఏదోలే సాతాను మాట విందాంలే అనుకొని మనం నిరాశను తెచ్చు కొందామా? లేక వానిని ఉధృతంగా ఎదిరించి సమృద్ధియైన జీవము అనుభవిద్దామా? అన్నది ప్రతీరోజు మనం చేయవలసిన ఎంపిక.

అయితే మనం దౌర్భాగ్యంగా బ్రతికినా లేక సమృద్ధియైన జీవితం అనుభవించినా తప్పక పరలోకానికి వెళ్లగలము. కాని పరలోకానికి వెళ్లే మన జీవితమనే త్రోవలో ఎంత సౌఖ్యాన్ని మనం పోగొట్టుకొన్నామో మనం తెలుసుకోవాలి. మనం ఇప్పుడే జీవాన్ని కోరుకొందాము. దేవుడు మనకు నియమించిన మార్గంలో సంతోషిద్దాము.

# 2

# మెలకువగానుండి ప్రార్థన చేయండి

"మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థనచేయుడి; ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనమని పేతురుతో చెప్పెను."

మత్తయి 26:41

నీ యింటి చుట్టూ శత్రుసమూహము ఉన్నారని, వారెప్పుడైనా నీ యింటి మీదికెగబడుదురని నీకు తెలిస్తే, నీవు మెలకువగానుండి నీ యింటి ద్వారమును కనిపెట్టుకొని యుండవలెనన్న మనస్సు కల్గియుండవా?

ఏదో ఒక కారణమును బట్టి నీవు మెలకువగా ఉండలేకపోతే, కనిపెట్టుకొనుటకు సమయము లేకపోతే, నీవేమి చేయగోరుదువు? అట్టి పరిస్థితిలో మీ కుటుంబీకులలో ఎవరైనా ఆ పని చేయుటకు జాగ్రత్తపడునట్లు చేయుదువు గదా!

ఈ పై వచనములో యేసు ప్రభువు మనం మెలకువగా ఉండాలని, జాగ్రత్త కలిగి, చురుకుగా ఉండి, అపాయము కలుగునేమోయన్న గమనము గలిగియుండి ప్రార్థించుమని కోరుచున్నాడు.

మనము విశ్వాసులము గనుక ఎడతెగక జాగరూకులమై, చురుకైనవారమై, మెలకువగానుండాలి. ఆ తరువాత, అవసరమైనప్పుడు ఆయుధధారులమై శత్రువుయొక్క దాడులను ఎదిరించాలి.

## పోరాడువాడవై యుండుము

"విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము."

1 తిమోతి 6:12

ఎదిరించేవాడు పోరాడేవాడుగా ఉండాలి.

అపోస్తలుడైన పౌలు 2 తిమోతి 4:7లో "మంచి పోరాటము పోరాడితిని" అని చెప్పి, తన యౌవన శిష్యుడైన తిమోతితో "విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము" అని హెచ్చరించాడు.

అదే రీతిలో నీవు నేను మన అనుదిన జీవితాలలో ఆకాశమండలమందలి ఆత్మసంబంధమైన శత్రువులతోను, మన స్వంత మనస్సులో, హృదయంలో కలుగు తలంపులతోను పోరాడవలసిన వారమైయున్నాము.

విశ్వాస సంబంధమైన పోరాటమందు, మన శత్రువు ఎవరో గుర్తించుట, ఏవి స్వాభావికమైన సంగతులో, ఏవి తప్పుడు సంగతులో గుర్తించుట కూడా ఒక భాగము.

ఒక ఉదాహరణను చూడండి.

కొంతకాలం క్రిందట ఒక వ్యక్తితో నేను సంభాషిస్తూ ఉంటిని. ఆ సంభాషణ కొనసాగుతుండగా నాకు కలవరం కలవరంగా ఉండింది. ఈ వ్యక్తితో

మాటలాడుటకు ప్రయత్నించినప్పుడల్లా అదే విధంగా జరుగుట నేను గమనించాను.

“ఈ వ్యక్తితో మాటలాడునప్పుడు ఎందుకు ఈ విధంగా జరుగుతుంది? దానికి కారణమేమిటి?” అని ఆశ్చర్యపడ్డాను.

దానిని గురించి నేను లోతుగా తలంచుట వల్ల అసలు సమస్యను గూర్చి తెలిసికొన్నాను. మేమిద్దరము కలిసి సంభాషించినప్పుడల్లా “ఈ వ్యక్తి నేను చేసిన పనులను గూర్చి తప్పుగా అర్థం చేసుకొనియుండునా?” అనుకునేదానను.

నేను ఆమెను కలిసికొన్నప్పుడెల్లా అదే తలంపు నాకు కలుగుతుండేది. ఈసారి ఆమె విషయం నేను ఎదిరించుటకు పూనుకొన్నాను. కొంతసేపు ఆగి, నేను ప్రార్థించాను. “యేసు క్రీస్తు నామమున ఆ దురాత్మపై అధికారము కోరుకున్నాను. గనుక నేను ఇక చింతపడను” అని నిశ్చయించుకొన్నాను. నేను చేసినపని ఆ వ్యక్తికి ఇష్టమున్నా లేకపోయినా, ఆ సంగతి దేవునికి ఆమెకు మధ్యలో జరిగే విషయమే గదాయని తలంచాను.

“నేను యధాతథంగా ఉండాలి. ఇతరులు ఏమనుకుంటారోనని వారి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా తీర్మానాలు చేయలేను. సాతానా, నేను ఈ చింత కలిగియుండలేను. యేసు నామమందు అట్టి జీవితమునకు స్వస్థి చెప్పాను.”

అట్టి తీర్మానము నేను చేసికొన్నప్పుడు నాలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యము నన్ను ఆవరించింది. నేను ఎదిరించని స్థితిలోనున్నప్పుడు సాతాను నన్ను ఎంతో బాధించింది.

మనకు కూడా అదే సమస్య. ఆ సమస్య ఏమంటే, మనం ఎదిరించని స్థితిలో ఉన్నాము. వాడు మనలను ఎదిరించుటకు చింతను, భయాన్ని, అనుమానాన్ని నేరస్థాపన మనస్తత్వాన్ని మనపై ఝుళిపించినప్పుడు మనం

వానిని ఎదిరించాలి. కాని వాడు మనలను దండించే సదుపాయము వానికి కలిగించకూడదు.

సాతానును మనము దరిచేరనీయకూడదు. మనము వానితో పోరాడేవారంగా ఉండాలి.

అయితే సాతాను కోరునదేమనగా మనము అందరితో తగవులాడే నైజము గలవారమై యుండాలని కోరుతాడు.

అయితే సాతాను దేనిని చేయాలని మనలను రేపునో, వాటన్నిటినీ చేయకుండా మరచిపోవాలని దేవుడు కోరుచున్నాడు. మన జీవితాలలో పోరాటములు కల్గించి మన సమాధానం, సంతోషం దొంగిలించాలని ఆశించే ఆత్మీయ శత్రువులతో పోరాడాలని దేవుడు కోరుచున్నాడు.

## సాధారణ జీవితమనగానేమి?

ఎక్కడ అసూయ, పోటీతత్వము ఉండునో అచ్చట తప్పక కలవరము ఉండును. అంతేగాక అన్ని రకములైన దుష్టత్వము, క్షీణత కల్గించు పద్ధతులు కూడా అక్కడ కనబడును.

> "ఏలయనగా, మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో, అక్కడ అల్లరియు ప్రతి నీచకార్యమును ఉండును. అయితే పైనుండివచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది, తరువాత సమాధానకరమైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరముతోను మంచి ఫలములతోను నిండుకొనినది, పక్షపాతమైనను వేషధారణయైనను లేనిదియునై యున్నది."
>
> యాకోబు 3:16,17

నిజముగా తిరిగి జన్మించిన వ్యక్తి జీవితములో కలవరము కల్గియుండుట సామాన్యంగా దేవుడు కోరని విషయము. గనుక మన జీవితంలో ఎప్పుడైనా కలవరం కలిగితే, దానిని మనం ఎదిరించాలి.

అయితే అట్టి సమయాల్లో మనలో ఏదో లోపమున్నదని తలంచి ఊరకుంటాము. కాని అది ఆత్మల లోకంలో మనపై ఎక్కుపెట్టబడిన ఎదిరింపు అని మనం గ్రహించాలి. దాని విషయమై మెలకువగా ఉండి ప్రార్థించే బదులు మనం ఆ సంగతులు ఎట్లు కలిగినవి అని వాటినే తలపోసుకునే తప్పు చేస్తూ ఉంటాము. ఏదైనా స్వాభావిక పరిస్థితులకు విరుద్ధంగా జరుగుతున్నప్పుడు, ఎప్పుడైనా ఆత్మలో భారంగా పీడింపబడుచున్నప్పుడు మెలకువగానుండి ప్రార్థించాలి. ఆ విధంగా మనం ఎడతెగక ప్రార్థించటం నేర్చుకుంటాము (1 థెస్స. 5:17). ప్రార్థించే అవసరమున్నదన్న భావన కల్గినప్పుడు నీవు తప్పక ప్రార్థించాలి.

చింతించుట స్వాభావిక లక్షణం కాదు. జరిగిన దానిని గూర్చి మదనపడుచు, దానికి కారణాలు వెదకుచు వేదనతో కాలం గడుపుట దేవుని చిత్తం కాదు. ఇతరులు మనలను గురించి ఏమి తలస్తున్నారో కదా అని అనుకొని చింతించడం స్వాభావికం కాదు. మనం కృంగిన స్థితిలోనుండి, దుఃఖించుచూ, మనం మంచివారం కాదు అనుకోవడం స్వాభావికంగా జరుగు విషయంకాదు. “అయ్యో! నా జీవితం సరిగా లేదే” అని చింతలో మునగడం కూడా స్వభావ సిద్ధమైన లక్షణం కాదు.

కొందరి జీవితాలలో ఇవి సామాన్యమైన విషయాలుగా పరిగణించబడవచ్చు. అయితే దేవుడు ఈ విషయాలు స్వభావసిద్ధమైనవిగా ఉండుటకు ఇష్టపడడు. అనగా మనం ఎడతెగక హింసింపబడాలని, మన తలంపుల ద్వారా బాధించబడాలని దేవుడెన్నడూ కోరడు. “ఆత్మీయమైన మనుష్యుడు” అని వాచ్‌మన్ గారు వ్రాసిన పుస్తకంలో “ఆత్మపై కలుగు భారము” అను భాగంలో అట్టి స్థితిని గురించి ఇట్లు వ్రాశాడు.

"ఆత్మ ఎల్లప్పుడు స్వాతంత్ర్యంలో ఉండాలి." అది తేలికగా ఉండి గాలిలో తేలినట్లుగా ఉండాలి. ఒక క్రైస్తవుడు తన ఆత్మపైనున్న భారములేమిటి? అన్నవి గుర్తెరగాలి. అనేక పర్యాయములు తాను అణపబడిన స్థితిలోనున్నట్లు; అతనిపై వేయిపౌండ్ల భారము మోపబడినట్లు అతడు అనుభవంతో తెలిసికొంటాడు. ఆత్మ సంబంధమైన మనుష్యుని విసుగుదలలో ముంచి, అతనికి సంతోషం కలుగకుండాజేసి, అతని ప్రాణాన్ని తేలికైన స్థితిలో సాతాను ఉండనివ్వడు. అతని ఆత్మ పరిశుద్ధాత్మతో కలిసి పనిచేయకుండునట్లు దుష్టుడు అడ్డుకుంటాడు. స్వేచ్ఛ గల ఆత్మయే జయవంతమైన జీవితమునకు పునాది... ఒక ఆత్మ ఆయా కారణముల చేత పీడింపబడినప్పుడు, మనస్సు యోగ్యమైన రీతిలో పనిచేయలేదు.

మన వ్యక్తిత్వంలోని భాగములన్నియు కలిసి ఐక్యంగా పనిచేస్తాయి. కనుక మనం స్వేచ్ఛగా సాదాసీదా స్థితిలోనే మనలను మనం ఉంచుకోవాలి. అటువంటి స్థితి కలిగియుండు నిమిత్తము మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క నాయకత్వం క్రిందికి రావాలి.

## క్రీస్తు యొక్క నాయకత్వం

> "మేము వితర్కములను, దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి..."
>
> 2 కొరింథీ 10:5

ప్రభువు మనకు విజయము చేకూర్చును. అయితే మన కార్యములలో ఆయన సంపూర్ణముగా నిమగ్నుడైతేనే ఆ విజయము మనదవుతుంది. కనుక ఆయన మన సమస్యలలో జోక్యం కలుగజేసికోవాలని ఆయనకు మొఱ్ఱపెట్టాలి.

మనం చేతులు ముడుచుకొని కూర్చుండి మన పరిస్థితులలో మార్పు రావాలని అనుకుంటే ఏ మేలు మనకు కలుగదు. మనము చేయవలసినపని తప్పక జరిగించాలి.

తన ప్రజలు ఏమి చేయలేని మందమైన స్థితిలోనుండి దేనిని పట్టించు కోనివారిగా, సోమరులుగా, చేయవలసిన పనులను వెంటనే చేయక తరువాత చేయవచ్చులే అన్న భావన కలిగియుండినప్పుడు సహితము మన ప్రభువు వారికి ఏదైనా సహాయము చేయశక్తిగలవాడు. ఇటువంటి లక్షణాలు మనలను కృంగుదలలోనికి, నిరుత్సాహములోనికి, నిరాశలోనికి నెట్టివేస్తాయి. కనుక మన భాగం మనం నెరవేర్చవలసినవారమైయున్నాము.

మన ఇష్టానుసారంగా ప్రవర్తించుటకు మనం పిలువబడలేదు. మనం దైవవాక్యం చేబూని, దానిని అనుదిన జీవితంలో అన్వయించుకొనుటకు పిలువబడ్డ ప్రజలము. ఆ విధంగా ఉండునిమిత్తము ఎల్లవేళలా ఆత్మీయంగా మెలకువ కలిగియుండాలి.

# 3

# సవాలుతో పనులు జరిగించుటకు కావలసిన ఆరు సంగతులు

"బాప్తీస్మమిచ్చు యోహాను దినములు మొదలుకొని యిప్పటి వరకు పరలోకరాజ్యము బలాత్కారముగా పట్టబడుచున్నది, బలాత్కారులు దాని నాక్రమించుకొనుచున్నారు."

మత్తయి 11:12

దేవుని రాజ్యమును అనగా రోమా 14:17లో చెప్పిన రీతిగా నీతిని, సమాధానమును, ఆనందమును బలాత్కారముగా తీసికొని అనుభవించాలి.

ఎన్నో సంవత్సరాలుగా నేను చేసిన సేవలోను, నా వ్యక్తిగత క్రైస్తవ నడకలోను నేను నేర్చుకొనినది ఏమనగా మనము సాతానును ఎదిరించి బ్రతుకు నిమిత్తము మనకు ఆరు సంగతులు కావలసియున్నవి.

## 1. సాతానును ఎట్లు సవాలుతో ఎదిరించాలోనన్న ఆలోచన కల్గియుండు

"మరియు ఏ రాజైనను మరియొక రాజుతో యుద్ధము చేయబోవునప్పుడు తన మీదికి ఇరువదివేల మందితో వచ్చువానిని పదివేల మందితో ఎదిరింప శక్తి తనకు కలదో లేదో అని కూర్చుండి మొదట ఆలోచింపడా?"

లూకా 14:31

యుద్ధమునకు పోవు వీరుడు తన సిద్ధపాటు విషయం ఆలోచిస్తాడు. శత్రువుతో ఎట్లు తలపడి వానిపై విజయము సాధించాలా అన్న దానికోసం ఒక ప్రణాళికను అతడు రూపొందించుకొని లెక్కించుకుంటాడు. తన సైన్యానికి, తనకు సాధ్యమైనంతవరకు ఏ హాని కలుగకుండా ప్రయత్నిస్తాడు.

మన క్రైస్తవ యుద్ధపోరాటములోను, అనుదిన జీవితములోను నీవు, నేను అట్లే ప్రవర్తించాలి.

"నేను ఈ అప్పుల బాధనుండి ఎట్లు బయటపడాలి? నా యింటిని నేను ఎట్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి? నాయింటి కోసం కావలసిన వాటిని ఎట్లు సమకూర్చుకోవాలి?"

"నా సేవాపరిచర్యలో అనేకులను నేను ఎట్లు చేరుకోవాలి? మేలుతో నా ఇరుగు పొరుగు వారిని ఎట్లు ప్రభావితం చేయాలి? పేదలకు ఎట్లు నేను దీవెనకరంగా ఉండగలను? దేవునికి నేను ఎట్లు ఎక్కువగా ఇవ్వగలను?" ఈ ప్రశ్నలు కూడా మనం కలిగియుండాలి.

ఆ విధంగా ఆలోచించండి. ప్రభువుయొక్క పనిలో ఎట్లు ఎక్కువగా నిమగ్నులు కాగలరో అన్నదాని విషయం ఆలోచించండి.

నీవు కుటుంబికుడవైతే, నీ కుటుంబ అవసరతలు తీర్చుట నీ మొదటి ప్రాధాన్యతగా ఉండాలి. అది నీ బాధ్యత. నీకు చిన్న చిన్న బిడ్డలున్నప్పుడు నీ

ప్రాధాన్యతలను విస్మరించకూడదు. నీ పిల్లలు ఎదుగుచున్న సంవత్సరాలలో వారితో నీవు కలసి ఎక్కువ సమయం గడపాలి.

ఆయితే కుటుంబాన్ని చూచుకుంటూ సేవా పరిచర్యలలో నిమగ్నుడవై యుండుట కూడా చేయగలవు. నా మట్టుకు నేను ఎన్నో సంవత్సరాలు ఆ విధంగా చేశాను. నా కుమారుడు ఒక సంవత్సరం వయస్సులోనున్నప్పుడే "లైఫ్ ఇన్ ది వర్డ్" అనే సంస్థలో పనిచేశాను.

ప్రారంభములో అసంభవముగా కనబడినప్పటికీ నీవు ఆ విధంగా చేయగలుగుతావని తెలిసికుంటావు. అయితే నీవు ఆ పనిచేయుటకు తగిన దేవుని పిలుపు కలిగి, తప్పక నేను చేస్తానన్న పట్టుదల ఆ విషయంలో నీకుండాలి.

నిర్మాణాత్మకంగా ఆలోచించు. నేను దేవునికి ఎంతో చేయవలసియున్నానని ఆనుకుంటూ చేతులు ముడుచుకొని కూర్చొనవద్దు. ముందుకు అడుగులేసి పనిజరిగించు. సవాలుతోకూడిన ఆలోచన కలిగియుండు.

## 2. సవాలుతో ప్రార్థించు

"గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము."

హెబ్రీ 4:16

దేవుని సింహాసనము ఎదుటికి మనమెట్లు రావలెను? భయములేని వారమై, ధైర్యముతో, విశ్వాసముతో రావలెను.

నీవు, నేను దేవుని యెదుట సిగ్గుపడి, భయపడినవారముగా నుండకూడదు. మనము ధైర్యముతో ముందుకు అడుగువేసి మనకు కావలసిన వాటిని దేవునియొద్ద అడుగవలెను. దేవుడు మనకొరకు తన వాక్యమునందు వాగ్దానము

చేసినవాటిని ఆయన యొద్దనుండి పొందుకొనుటకు ఎదురు చూస్తున్నామని మనము ఆయనకు తెలియచెప్పాలి.

ఎఫెసీ 3:20లో దేవుడు మనము అడుగువాటన్నిటికంటే ఊహించు వాటన్నిటికంటే అత్యధికముగా చేయశక్తిగలవాడని చదువుతాము. అనగా ఆయన మన ప్రార్థనలన్నిటికీ, ఆశలన్నిటికీ, తలంపులన్నిటికీ, నిరీక్షణలన్నిటికీ, కలలన్నిటికీ మించి ఎల్లప్పుడు ఇచ్చుచునేయుండునని అర్థము.

"ధైర్యము" అను మాటను గమనించండి. దాని అర్థమేమనగా నీవు, నేను ఎంతో నమ్మకముతో, ధైర్యంగా, సవాలుతోనున్న క్రైస్తవులమైయుండాలి.

నీవు దేవుని సింహాసనమును సమీపించునపుడు అట్టి ధైర్యస్థైర్యములతో సమీపించుము.

**3. సవాలుతో మాటలాడండి**

"ఒకడు బోధించినయెడల దైవోక్తులను బోధించునట్టు బోధింపవలెను."

1 పేతురు 4:11

నీవు, నేను దేవుని పిల్లలము గనుక గొంతెత్తి ప్రార్థించాలి.

సవాలుతో మాటలాడండి అని నేను అన్నప్పుడు నీ శరీరమును ఆస్పదం చేసికొనమని నేను అనుటలేదు. సాతాను యొక్క శక్తులపై మీరు ఆత్మీయమైన సవాలు కలిగియుండాలని నా భావన.

ఒక ఉదాహరణ చూడండి.

బైబిలులో ఒక చోట మనం పావురముల వలె నిష్కపటులుగా ఉండవలెనని చెప్పబడింది (మత్తయి 10:16). అయితే మరియొక చోట సింహమువలె ధైర్యంగా

ఉండండి అని చెప్పబడింది (సామె. 28:1). ఈ రెండు రూపకాలను సమన్వయ పరచుకోవడం నాకు కష్టమనిపించింది.

అప్పుడు క్రైస్తవేతరుడైన ఒక యజమాని యొద్ద పనికి కుదిరిన ఒక పనివానిని నా మనస్సులో ఊహించుకొన్నాను. యజమాని ఆ పనివానిని పిలిచి నానావిధములైన దుర్భాషలాడాడు. అయితే ఆ పనివాడు తన నోరు తెరిస్తే తన ఉద్యోగం ఊడిపోతుందేమోనని మిన్నకున్నాడు. ప్రభువే న్యాయం తీరుస్తాడని అతడు మౌనం వహించాడు. పావురంవలె పైకి నమ్రత కల్గియున్నప్పటికినీ ఆ పనివాడు తన అంతరంగములో సింహమువలె ధైర్యం కలిగియున్నాడు.

అదేరీతిగా నీవు, నేను బాహ్యరూపానికి మృదువుగా ఉన్నప్పటికినీ, ఆత్మలో సవాలు గల్గినవారమై యుండాలి. ఇతరులు కఠినంగా మనపై మాటలు విసిరినను ఆత్మలో వాటిని మనం ఎదిరిస్తూ ఉండాలి.

శిక్షావిధి క్రిందికి వచ్చుటకు మనము నిరాకరించవచ్చు. శారీరకంగా ఇతరులు మనలను కష్టపెట్టినప్పటికీ ఆత్మలో మనం ప్రార్థించవచ్చు.

అటువంటి పరిస్థితినుండి బయటపడిన తరువాత మనం సవాలుతో కూడిన ధీమాతనంతో మన నోటితో మాటలాడవచ్చు. మనలను మాటలతో ఆరడి పెట్టిన ఆత్మీయ శత్రువులతో మన ఆత్మీయ అధికారమును ఉపయోగించి వారిని బంధించవచ్చును.

ఎవరైనా నన్ను శారీరకంగా ఎదిరించినపుడు నేను ఆత్మలో ప్రార్థించుట ప్రారంభింతును. అట్టి దుర్భాషలలో తడిసి తేలియాడుట నాకిష్టము లేదు. కనుక ఆత్మీయంగా నన్ను నేను భద్రపరచుకుంటాను.

ఎన్నో సంవత్సరాలుగా ఇతరులు నా పైన దుర్భాషలతో దాడిచేశారు. నేను కూడా శరీరానుసారివలె వారిని ఎదిరించాను. కానీ నా ప్రయత్నములేవీ ఫలించలేదు. ఆ తరువాత ప్రయోజనకరమైన మార్గమేదో నేను కనుగొన్నాను.

నేను కనుగొన్న ప్రయోజనకరమైన మార్గము కఠినమైనదే. మనము పోరాడునది శరీరులతో కాదుగాని ప్రధానులతోను, అధికారులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నామన్న ఎరుకలోనికి వచ్చాను. అనగా నేను ఆత్మీయపోరాటము ఎట్లు సలుపవలెనో ఆ రహస్యాన్ని కనుగొన్నాను.

నీవు కూడా ఆ విధంగానుండుటకు నేర్చుకొనవలసియున్నావేమో? పావురము వలె సాధువైయుండి, సింహమువలె ధైర్యము కల్గియుండాలి. అట్టి సవాలు జీవితమును అభివృద్ధి చేసుకోవాలి.

నీవు ఇతరులతో మాటలాడునప్పుడు నీ చేతులు జోడించి, సణుగుచున్నట్లు మాటలాడవద్దు, నీళ్లు నమలవద్దు, ఎగతాళిగా ఉండవద్దు. నిటారుగా నిలువబడు. వారి కళ్లల్లోకి చూస్తూ, వారితో సూటిగా, ఖచ్చితంగా, వివరంగా మాటలాడు. మంచిస్వరముతో, ఉచ్చారణతో చెప్పుము. నీవు చెప్పునది వినువారికి గ్రహింపదగినదిగా ఉండునట్లు చూచుకోవాలి.

భోజనం చేస్తున్నప్పుడు కలిగే స్వరములాంటి స్వరంతో మాటలాడవద్దు, భయభ్రాంతులతో కూడా మాటలాడవద్దు. నీ నోరు తెరచి, నీవు చెప్పవలసిన దానిని ధైర్యంగా, నిశ్చయతతో ఇతరులకు వినిపించు.

నీవు పాటలు పాడి దేవుని స్తుతించగోరితే ధైర్యంగా, సవాలుతోనే ఆ పని చేయండి. నీవు నోరు తెరచి దేనినైనా మాటలాడగోరినపుడు దేవుని మాటలవలె మాటలాడుము. ఉత్సాహంతో, ఆనందంగా, కృపాసహితంగా, మాటలాడు, సవాలుతో మాటలాడు.

## 4. సవాలుతో ఇవ్వండి

> "క్షమించుడి, అప్పుడు మీరు క్షమింపబడుదురు; ఇయ్యుడి, అప్పుడు మీ కియ్యబడును; అణచి కుదిలించి, దిగజారునట్లు నిండు కొలతను

మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువ బడునని చెప్పెను."

లూకా 6:38

నీవు, నేను ఇచ్చునప్పుడు ఉదారంగా, సవాలుతో ఇవ్వాలి. ఎందుకంటే మనం ఇతరులకు ఇచ్చినప్పుడే అదే విధానములో తిరిగి పొందుకుంటాము.

నీ డబ్బు సంచిలో వెదికి చిన్ననోటును బయటికి తీయవద్దు. దేవుడు మనకిచ్చినట్లు సమృద్ధిగా ఇవ్వాలి.

మనము దేవునికిచ్చే అర్పణలో ఏదియు తక్కువైనది కాదు లేక ఎక్కువైనది కాదు. కాని మన క్రైస్తవ జీవితంలో ఇతర విషయాలలో ఎంత సవాలుతో బ్రతుకుతున్నామో, అంత సవాలుతోనే ఇచ్చే విషయంలో కూడా సవాలుతో ఇవ్వాలి.

నేను ఇచ్చేదానిగా ఉండాలని కోరుతున్నాను. నా జీవితమంతా ఇతరులకు ఇచ్చుటలో నిమగ్నమైయుండగోరుతాను.

ఒకసారి నేను ఒక క్రైస్తవ పుస్తకశాలకు వెళ్ళినపుడు, ఆకలితోనున్న చిన్న బిడ్డలకు సాయం చేసే ఒక పరిచర్యకు సంబంధించిన చందాపెట్టెను అక్కడ చూచాను. "25 రూపాయలతో ఇద్దరు పిల్లలు రెండుసార్లు తినగలరు" అన్నమాటలు అక్కడ వ్రాయబడి ఉన్నాయి. నేను నా డబ్బు సంచితీసి కొంత చందా వేద్దామనుకునే సరికి, నేను ఒక స్వరము విన్నాను. "ఎందుకు నీవు ఇస్తావు. నీవు ఎన్నోసార్లు ఎంతో మందికిస్తావు కదా! ఈ సారి వద్దులే" అని ఆ స్వరం నాతో అన్నది.

నేనెంతో ఉగ్రురాలనయ్యాను. ఆత్మీయ ఉగ్రత నాలో పెల్లుబికింది. దానిని నేను బయటకు కనుబరచలేదు గాని, హృదయంలో రెచ్చిపోయాను. నేను నా

డబ్బు సంచిలో కొంత తీసి ఆ డబ్బాలో వేశాను. నా స్వంత ఇష్టాన్ని నేను చూపించుకోవడానికి ఆ పని చేశాను.

నీవు కూడా ఆ విధంగా చేయవచ్చు. ఇవ్వడానికి బుద్ధిపుట్టనపుడు, ఎక్కువగా ఇవ్వాలి. ఇచ్చే విషయంలో కూడా సవాలుతోనున్నానని సాతానుకు చూపించు.

**5. సవాలుతో పనిచేయండి**

"చేయుటకు నీ చేతికివచ్చిన యే పనియైనను నీ శక్తి లోపము లేకుండా చేయుము; నీవు పోవు పాతాళమునందు పనియైనను ఉపాయమైనను తెలివియైనను జ్ఞానమైనను లేదు."

ప్రసంగి 9:10

మనము దేనినైనా చేయుటకు ప్రారంభించినప్పుడు సవాలుతో చేయాలి. ఏ పని చేయవలసి వచ్చినా భయంతో చేయవద్దు. అవకాశం దొరికితే పారిపోదామనుకోవద్దు. పరిశుద్ధాత్మద్వారా పురికొల్పబడి ఈ విధంగా నీవు చెప్పవలెను. "ఈ పని దేవుడు నాకు అప్పగించాడు. పరిశుద్ధాత్మ సాయంతో నేను ఈ పనిని దేవుని మహిమార్థమై చేస్తాను?..."

**6. సవాలుతో ప్రేమించు**

"నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొకనినొకడు ప్రేమించవలె ననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటే ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు".

యోహాను 15:12,13

మనము దేవుని పిల్లలము గనుక, దేవుడు మనలను ఎట్లు ప్రేమించాడో, అదే విధంగా మనం ఇతరులను ప్రేమించాలి. సవాలుతో ప్రేమించాలి. సమర్పణతో ప్రేమించాలి.

ప్రేమించుటయందు తగినంత ప్రయత్నం మనము చేయవలసియుంది. తగినంత క్రయం చెల్లించకుండా ఎవరునూ ఇతరులను ప్రేమించలేరు.

ఒకసారి, ఒక స్త్రీకి నేను చెవులకు ధరించే అందమైన పోగులను ఇచ్చాను. అయితే నా శరీరము వాటిని నేనుంచుకుంటే బాగుండునని నన్ను శోధించినది. అయితే నా ఆత్మ నాతో నీవు ప్రభువుకు విధేయత చూపి వాటిని ఆమెకు ఇచ్చివేయి అని చెప్పింది. ఆ తరువాత ఆమె ఒక కూటమునందు నిలువబడి తన చెవిపోగులు తనకెట్లు లభించెనో సాక్ష్యమిచ్చింది.

అప్పుడు ప్రభువు నాతో మాటలాడి “ఆ చెవిపోగులు ఆమెకు ఉచితంగా ఇవ్వబడిన కానుక. అయితే దానికి క్రయము నీవు చెల్లించావు. ఆలాగే నీకు నేనిచ్చిన రక్షణ నీకు ఉచితంగా ఇవ్వబడిన కానుక. అయితే దానిని నీకు ఇచ్చుటకు యేసుప్రభువు తన ప్రాణము అర్పించవలసివచ్చెను” అని ప్రభువు అన్నాడు.

ప్రేమ అన్ని వరములకంటే ఎంతో గొప్పది. నీవు దేవుని ప్రేమను కనుపరచినపుడు స్వేచ్ఛగా, సమర్పణతో ప్రేమించు; సవాలుతో ప్రేమించు.

# 4

# నిరాశను పరిష్కరించుట

వెబ్‌స్టర్ నిఘంటువును బట్టి చూస్తే, నిరాశ అనగా మన "నిరీక్షణ తప్పి పోవుట" లేక "ఆశ నెరవేరకపోవుట" లేక మనం "అనుకున్నది జరుగకపోవుట" అని అర్థము.

మనం ఆశించిన ప్రకారము, మనం ఎదురుచూచిన ప్రకారము, మనం నిరీక్షించిన ప్రకారము జరుగకపోతే మనం నిరాశలో మునిగిపోతాము. మన జీవితంలో నిరాశను ఏదో ఒక సమయంలో ఎదుర్కొంటూనే ఉంటాము. నిరాశ అనునది జీవితములో సామాన్యంగా జరిగే విషయమే. దానిని మనం ఎదుర్కొన్నప్పుడు, దానిని చక్కబరచప్రయత్నించాలి. లేనియెడల అది మనలో నిరుత్సాహానికి దారితీస్తుంది. దానిని తగిన సమయానికి చక్కపరచకపోతే, అది పూర్తి నాశనానికి నడిపిస్తుంది.

ఇట్టి పాడైన స్థితికి ఎందుకు దిగజారిపోయామా అని ప్రజలు అనుకుంటారు గాని, దాని కారణం కోసం వెదకరు. అసలు అట్టి నిరాశ ఎంతో కాలము క్రిందటే జీవితంలో ప్రవేశించిందని వారు గుర్తించరు. దానివల్ల కలుగబోవు అనర్థకములు ముందు ముందు ఎన్నో విధాలుగా బయలుపడతాయి.

## ముందుగా కనబడు సూచనలను గమనించుము

నేను ఉదయాన్నే లేచినప్పుడు గొంతు రాచినట్లుగా, తలనొప్పి ఆరంభమైనట్లుగా ఉంది అనుకుంటే, జలుబు చేసింది అనుకుంటాను. దానిని తీసివేసికొనుటకు ప్రార్థించి 'సి' మరియు 'ఎ' విటమినులు తీసికొంటే పరిస్థితి మెరుగుపడుతుంది.

ఏదైనా జబ్బు రాకముందు, దాని లక్షణాలు, గురుతులు ముందుగానే మనకు తెలుస్తాయి. అప్పుడు ఏదో ఆరోగ్యములో లోపముంది అని మనం గ్రహిస్తాము. అది ఎక్కువగాకముందే దానిని పోగొట్టుకొనే మార్గం ఆలోచిస్తాము.

నిరాశ కూడా అదే మార్గంలో పనిచేస్తుంది. అది కలుగకముందే దాని లక్షణాలు మనకు తెలుస్తాయి. కనుక ఆ నిరాశ మనపై విజృంభించకముందు మనం తగిన ఉధృతమైన చర్యలు తీసికోవాలి.

మనం ముందుగా చెప్పుకున్నట్లు సాతాను మనపై దండెత్తే ప్రమాదమున్నదని ఆయా గురుతులద్వారా తెలిసికోగానే వానిని ఎదిరించాలి. మనకు నిరాశ కలిగిన మొదటి క్షణాల్లోనే వానిని ఎదిరించుట సులభము. లేకపోతే మనకు కృంగుదల సంభవిస్తుంది. ఆ స్థితిలో సాతానును ఎదిరించుట బహు కష్టసాధ్యముగా నుండును.

ఒకడు మనయెడల తప్పుచేసిన వెంటనే వానిని క్షమించుట సుళువని మనమెరుగుదుము. అయితే తప్పుచేసిన తరువాత వానిపై మనం కోపగించుకొని, కక్ష సాధింపు మనస్సు పెంపొందించుకొని, హృదయం కఠినపర్చుకొన్న తరువాత వానిని క్షమించుట అతికష్టము.

నిరాశ విషయంలో కూడా అంతే. నిరాశ కల్గిన వెంటనే దానినుండి విడుదల పొందేందుకు ప్రయత్నించాలి. అప్పుడే అది సుళువుగా ఉంటుంది. లేకపోతే కృంగుదలకు తరువాత నిస్పృహకు ఆ తరువాత వినాశనానికి దారితీస్తుంది.

## నిరాశ కలుగుటకు కారణములు

ఒకవేళ నీవు వనభోజనాలకో లేక నీ స్నేహితులతో కలిసి విహారయాత్రకో లేక పెండ్లికో వెళ్లుటకు తయారైన తరువాత వర్షం రావచ్చు.

మీ కుటుంబాన్ని స్నేహితులను ఆహ్వానించి అన్ని ఏర్పాట్లు చక్కగా చేసిన తరువాత ఆ కార్యక్రమం ప్రారంభం కాగానే పెద్దవర్షం వచ్చి, అంతా నీళ్లమయం కావచ్చు. అప్పుడు నిరాశ పుట్టుకొస్తుంది. అయితే అది కొద్ది పరిమాణంలోనున్న నిరాశయే. దానిని త్వరగానే జయించవచ్చు.

అటువంటివి సంభవించినప్పుడు "భలే నిరాశ కలిగిందే! అయితే ప్రపంచమంతా మునిగిపోలేదు కదా! ఈ పరిస్థితిని చక్కపరచుకోవచ్చులే" అని నాలో నేను అనుకొంటాను.

వీటికంటే ఎక్కువ నిరుత్సాహం కలిగించి, ప్రమాదకరమైన పరిస్థితులను సృష్టించే సమయాలు కూడా రావచ్చు. అంటే జీవయుక్తం గాని వాతావరణ పరిస్థితులు మాత్రమేగాక జీవముగల వ్యక్తులు కూడా ఈ పరిస్థితులలో మనలను నిరాశకు గురిచేయవచ్చు.

## ఎవరిపైనా ఆధారపడవద్దు

> "అయితే యేసు అందరినీ ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు."
>
> యోహాను 2:24

మనమెంతో అసంపూర్ణులము గనుక మనకు అప్పుడప్పుడు కలిగే నిరాశలు మాత్రమే గాక ఎల్లప్పుడు మనలను బాధించుచూ, మనం ఓర్చుకొనవలసిన నిరాశలు కూడా కలుగవచ్చు. ఈ ప్రపంచంలో ఎవరైనా, వారెట్టివారైనా సరే, వారి మీద మనం పూర్తి నమ్మకం పెడితే వారు మనలను నిరాశకు గురిచేస్తారు.

నేనేదో నిరాశావాదిగా ఈ మాటలు చెప్పుటలేదు. కానీ అది జీవితంలో అనుదినం మనం అనుభవించే సత్యమే. కనుకనే మనకెంత సన్నిహితులైననూ వారిపై పూర్తిగా మనం ఆధారపడకూడదు.

ప్రజలయొక్క నమ్మకాన్ని స్వంతం చేసుకోవడానికి సంవత్సరాలకొలదీ ప్రయత్నించినవారే ఈ మాటలు పలకడం మనకెంతో విడ్డూరంగా ఉండవచ్చు. మన ప్రభువైన యేసు యొక్క జీవితమును చూచి మనం నేర్చుకునేదేమంటే, మనుష్యులను మనం కొంతవరకే నమ్మవచ్చు. అయితే మనం సమతుల్యత లేనివారంగా కాని, బుద్ధిహీనంగా కాని వారికి అప్పగించుకోకూడదు.

యేసుప్రభువు వలె అందరినీ ప్రేమించాలి గాని అందరినీ నూటికి నూరు శాతం నమ్మకూడదు. మనం ఇతరుల విషయంలో తప్పిపోయిన రీతిగానే ఇతరులు కూడా తొందరగానో ఆలస్యంగానో మన విషయంలో తప్పిపోతారు.

తప్పిపోయే గుణం మానవనైజము. కనుక జ్ఞానియైనవాడు తనలోనున్న తప్పిపోవు గుణము విషయంలోగాని, ఇతరులలోని తప్పిపోవు గుణము విషయంలో గాని జాగ్రత్తపడవలెను.

నిరాశలో పడి కొట్టిమిట్టాడే కంటే నిరాశను మనకు దూరంగా ఉంచుకోవడమే శ్రేష్టము. అట్లు నిరాశకు దూరంగా ఉండాలంటే మనం మనకు కలిగే కోరికలు, నిరీక్షణలు మనష్యులతోడి సంబంధాల విషయంలో నిజాయితీగా ప్రవర్తించాలి. మన స్వంత విషయాలలో కూడా నిజాయితీ పాటించాలి.

> "జ్ఞానముగల కుమారుడు తండ్రిని సంతోషపరచును, బుద్ధిలేని కుమారుడు తన తల్లికి దుఃఖము పుట్టించును."
>
> సామెతలు 10:1

కొన్నిసార్లు చిన్నబిడ్డలే తమ తల్లిదండ్రులకు నిరాశాజనకంగా ఉంటారు.

ఈ రోజుల్లో అనేకమంది తల్లిదండ్రులు తమబిడ్డలు వారు చెప్పే హితవులను ఒక చెవితో విని మరో చెవితో విడిచిపెడుతున్నారని అంటారు.

వారు చెప్పే ఇట్టి విషయాలు నేను కూడా అర్థం చేసికోగలుగుతాను. నా కుమారుడైన 'డానీ' ఎదుగుచున్న వయస్సులో ఆలాగే ప్రవర్తించేవాడు. నేనేదో ప్రాముఖ్యమైన విషయం చెబుతుంటే తనకు వినబడనట్టే నావైపు అదోలా చూచేవాడు. తాను చేసిన ఒక బుద్ధిహీనమైన కార్యము నిమిత్తము తాను చదువుతున్న బడిలో మధ్యాహ్న భోజనం వాడికివ్వబడలేదు. "ఎందుకావిధంగా ప్రవర్తించావు?" అని నేను అడిగితే ఫరవాలేదులే అన్నట్లు వెళ్లిపోయాడు. అది జవాబు కాదు గదా! జవాబు చెప్పమని నేను వాడిని నిలదీశాను. అందుకతడు "నాకు తెలియదు, ఎందుకు చేశానో" అన్నాడు. నేను ఎన్నిసార్లు అడిగినా "నాకు ఏమి తెలియదనే" జవాబు మాత్రమే అతడిచ్చాడు.

కనుక నేను అతనికి చేయగలిగిందంతా ఏమంటే, ఎట్లు ప్రవర్తించాలో, ఎట్లు గమనము గలిగి గ్రహించుకోవాలో, తన భవిష్యత్తుకొరకు ఎట్లు సిద్ధపడాలో అన్నవాటిపై అతనితో సుదీర్ఘంగా చెప్పాను.

రెండోరోజు అతనిని మరలా బడికి పంపాను. అతని ప్రవర్తనలో, దృక్పథంలో గొప్పమార్పు గలిగి ఉంటాడని అనుకున్నాను. కాని ఆ రోజు బడినుండి ఇంటికి వచ్చేటప్పుడు తన టీచరు గారినుండి ఒక ఉత్తరం తెచ్చాడు. దానిలో "డానీ ఈ రోజు స్కూలు మొదలైనప్పటినుండి బహు తుంటరిగా ప్రవర్తించాడు" అని వ్రాసి ఉంది.

దానిని చూచినప్పుడు తల్లినైన నాకు అది ఎంతో నిరాశకల్గించింది. అతడు ఎదుగుచున్నప్పుడు మళ్లీ అటువంటి సంగతులు పునరావృతమైతే ఇంకా ఎక్కువ దుఃఖం కలుగుతుంది గదా!

ఒకదాని విషయమై, మనమెంత ఎక్కువగా ఆశించి, ఎక్కువ ప్రతిఫలము ఎదురుచూస్తామో, అది జరుగనప్పుడు, అంతగా కృంగిపోతాము. ఇప్పుడు చిన్న చిన్న విషయాల్లో కూడా నిరాశ, నిస్పృహ కలిగినప్పుడు, వాటిని సరిగా పరిష్కరించకపోతే అపాయకరమైన పరిణామాలకు దారి మళ్లుతుంది.

## ద్రాక్షాతోటలను పాడుచేయు గుంటనక్కలు

"మన ద్రాక్షతోటలు పూతపట్టియున్నవి ద్రాక్షతోటలను చెరుపు నక్కలను పట్టుకొనుడి సహాయము చేసి గుంటనక్కలను పట్టుకొనుడి."

పరమగీతము 2:15

చిన్న చిన్న నిరాశలే పెద్దపెద్ద సమస్యలకు దారితీయవచ్చును. అందువలన గొప్ప నష్టము వాటిల్లును.

మనం కోరుకొన్న ఉద్యోగము, ఉద్యోగపు పదోన్నతి లేక స్వంత యిల్లు మొదలైనవి పొందలేకపోతే గొప్ప నిరాశ కలిగియుంటాము. ఎడతెగని ఆయాసానికి గురి అవుతాము.

ఈ క్రింది ఉదాహరణలు చూడండి, భోజనానికి నీవు ఎవరినో ఆహ్వానిస్తే సమయానికి అతడు రాలేకపోయాడు. ఒక పెద్ద దుకాణానికి వెళ్లి ఏదో ఒక మంచి వస్తువు కొనాలనుకుంటే, అక్కడకు నీవు వెళ్లేసరికే అది అమ్ముడయి పోయింది. ఒక ప్రత్యేక కార్యక్రమానికి నీవు వెళ్లుటకు చక్కని దుస్తులు ధరించి, తీరా అక్కడికి వెళ్లేసరికి, నీకు తెలియకుండా నీ పైవస్త్రము చినిగింది.

పై సంగతులవంటివి జరిగినప్పుడు అవి చాలా సామాన్యమైన చిన్న సంగతులైనప్పటికీ మనకు నిరాశకల్గించును. కనుక వాటిని మనం ముందుగానే ఎరిగి వాటిని ఎట్లు చక్కదిద్దుకోవాలో తెలిసికొనియుండాలి. లేకపోతే అవి

మనమూహించని పరిమాణములో మనకు నష్టము వాటిల్లజేయును. అందువల్ల మనము నిజమైన సవాళ్లను ఎదుర్కొనవలసివస్తుంది.

మరో ఉదాహరణ చూడండి.

ఒకవేళ నీవు ఆలస్యంగా నిద్రలేచావు. అందువల్ల అన్నిపనులు ఆలస్యంగానే అవుతున్నాయి. దానిని బట్టి నీవు ఆయాసంతో నిండిపోయావు. నీవు ఆఫీసుకు వెళ్తుంటే ట్రాఫిక్ సమస్యకు గురియై ఆలస్యమైపోయావు. ఇంతాచేసి ఆఫీసులో అడుగుపెడితే, నీ వెనుక ఎవరో ఒకరు "ఎంత ఆలస్యంగా వచ్చాడో చూడు" అనుకుంటున్నారు.

సరే, అన్నిటినీ కొంత మరచి నిన్ను నీవు అదుపులో పెట్టుకోవడానికి కాఫీ తెప్పించుకొని త్రాగబోతే అది ఒలికి నీమీద కారిపోయింది. నీ యజమానిని ప్రాముఖ్యమైన రీతిలో నీవు కలిసికోవలసియున్నది. నీకు బట్టలు మార్చుకొనే సమయం లేకపోయింది.

ఇవన్నీ ఒకదానిపై ఒకటి నీమీద కుప్పగా పడినవి. అదేసమయంలో నీవు ప్రార్థించినదానికి భిన్నంగా డాక్టరుగారి రిపోర్టులో నీ ఆరోగ్యములో లోపమున్నట్లు నీకు తెలిసింది. అంతలో నీవు పెండ్లి భార్యగా స్వీకరించబోయే స్త్రీ నీకు ఫోను చేసి "నీవు నాకిష్టము లేదు, నేను నిన్ను పెండ్లి చేసికోను అన్నది"

ఈ పరిస్థితులన్నీ మూకుమ్మడిగా నీకు సంభవిస్తే నీనుండి కలిగే ప్రతిస్పందన – విశ్వాసమా? లేక ఆగ్రహమా?

చిన్న చిన్న విషయాలుగా పరిగణింపబడే ట్రాఫిక్ సమస్య, మన వెనుక చెడుగా మాటలాడుకొనుట, కాఫీ ఒలికిపోవుట ఇవన్నీ కూడా మనలను పెద్ద సమస్యలైన రోగము కలుగుట లేక సంబంధ బాంధవ్యములు చెడిపోవుట వంటి వాటికి దారితీయును.

కనుకనే ద్రాక్ష గెలలను పాడు చేయు గుంటనక్కలతో మనం జాగ్రత్తగా ఉండాలి. అప్పుడే వాటి వెంటవచ్చే పెద్ద సమస్యలనుండి కాపాడుకోగలము.

సర్పము తన చేతిని కరచి వ్రేలాడుచున్నప్పుడు పౌలు ఏమి చేశాడో అన్న విషయాన్ని చూచి మనం ఒకపాఠం నేర్చుకోవాలి. అతడు దానిని విదిలించివేశాడు. (అపో.కా. 28:1-5). నిరాశలు మనకు కల్గినప్పుడు వాటిని త్వరత్వరగా పరిష్కరించుకుంటే అవి వినాశం కలిగించే గొప్ప పర్వతాలలాగా రూపుదిద్దుకోవు.

# 5

# యేసుక్రీస్తునందు ధైర్యంతో నమ్మిక కల్గియుండుము

"నా ప్రాణమా, నీవు ఏల క్రుంగియున్నావు? నాలో నీవేల తొందరపడుచున్నావు? దేవునియందు నిరీక్షణయుంచుము. ఆయనే నా రక్షణకర్త అనియు నా దేవుడనియు చెప్పుకొనుచు ఇంకను నేను ఆయనను స్తుతించెదను."

కీర్తనలు 42:5

మన జీవితంలో ఎప్పుడు ఏమి సంభవించునో మనం తెలిసికోలేము. గనుక మన నిరీక్షణ దేవునియందు మనముంచుకోవలెను.

బైబిలులో అనేక స్థలాల్లో యేసు క్రీస్తు బండగా చెప్పబడ్డాడు (1 కొరింథీ 10:4). కొలస్సీ 2:7లో అపోస్తలుడైన పౌలు చెప్పినదేమనగా మనము ఆయనలో వేరుపారి స్థిరపడాలి అన్నాడు. అయితే ఇతర మనుష్యులలో గాని, మన ఉద్యోగములో

గాని, సంఘములో గాని, స్నేహితుల విషయంలో గాని వేరుపారి స్థిరపడి యుండాలని వ్రాయబడలేదు. అయితే బండయైన యేసుక్రీస్తు చుట్టు మన వ్రేళ్లు ప్రాకి ఆయనను అంటిపెట్టుకొనియున్నయెడల మనము క్షేమముగానుందుము. అయితే ఏ మనుష్యుని చుట్టు గాని, ఏ వస్తువు విషయంలో గాని మన వ్రేళ్లు పాతుకుపోయినయెడల మనము కష్టములలో కూరుకుపోతాము.

ఏ వస్తువైనను, ఏ వ్యక్తియైనను యేసువలె గట్టిగా, స్థిరంగా, కదలని వారుగా ఉండలేరు. గనుక ఎవరైనను నా పరిచర్యలో స్థిరంగా ఉంటామని ఊహించు కోవద్దని కోరుచున్నాను. నామీద పూర్తిగా ఆధారపడకూడదు. ప్రజలు యేసువైపే చూడాలని, ఆయనయందే ఆశపెట్టుకోవాలని కోరుతాను. నాయందు ఆశపెట్టుకొన్న వారిని నేను నిరాశపరచవచ్చు, లేక వారే నన్ను నిరాశపరచవచ్చు.

మానవులమైన మనమందరము అట్టి సమస్యగల్గియున్నాము. మనము తప్పిపోయే స్వభావము గలవారము.

అయితే యేసుక్రీస్తు మాత్రమే యెన్నడునూ తప్పిపోడు. యేసుక్రీస్తు నందే వేరుపారి స్థిరపడియుండుము. నిన్నుగాని, నీకు కలిగే పరిస్థితులను గాని నమ్ముకోవద్దు. నీ బ్యాంకు ఖాతాను, ఉద్యోగమును లేక దేనినైనను ఎవనినైనను నీవు నమ్ముకోవద్దు.

నీ రక్షణకు కారణభూతుడైన బండయైన యేసుక్రీస్తునందు నీ నిరీక్షణ ఉంచుకొననియెడల నీవు నిరాశచెంది, చివరకు నాశనమునకు పోవుదువు.

## మనుష్యులు లోపభూయిష్టులు

"శ్రమకాలములో విశ్వాసఘాతకుని ఆశ్రయించుట విరిగిన పళ్లతోను కీలు వసిలిన కాలుతోను సమానము."

సామెతలు 25:19

కొంతకాలం క్రితం నా కుమార్తెకు వివాహమునకు ముందు జరిగే నిశ్చితార్థ కార్యక్రమం కోసం ఉంగరం కొన్నాము. కొంత డబ్బు కూడా సమకూర్చుకొన్నాము. వివాహము కొరకైనఏర్పాట్లు కూడా చేశాము. అయితే పెండ్లి కుమారుని యొక్క నమ్మలేని స్థితిని బట్టి, అతని యథార్థతలేని స్థితినిబట్టి ఆ కార్యక్రమమంతటినీ ఆపివేయవలసివచ్చింది.

పెండ్లి కుమార్తె కాబోయే ఆ అందమైన నా ప్రియకుమార్తె విషయంలో అది ఎంతో విషాదకరమైన పరిస్థితిగా మారింది. అటువంటివి ఆమె జీవితంలో ఎన్నో జరిగినవి. అయితే ఈసారి ఆమె శత్రువుపై జయము సాధించింది. ఎందుకంటే ఆమె దేవుని స్తుతించి ఈ మాటలు పలికింది.

"దేవా, వివాహమునకు ముందే ఈ సంగతులు మాకు చూపించబడినందుకు వందనాలు, వివాహమైన తరువాత జీవితదారిలో అతడెంత మోసగాడో తెలిసికొని బాధపడుట కంటే ఇది మేలు కదా?" అన్నది.

ఆ భయంకరమైన పరిస్థితిలో ఆమె ఎట్లు నిరాశను జయించిందో చూచి నేనామె విషయము గర్విస్తున్నాను. వివాహమునకు ముందు జరిగిన ఆ గందరగోళ పరిస్థితిని బట్టి ఆమె మొదటిగా బాధ అనుభవించింది. అందుకు నేను, నా భర్త ఆమెకు ఆలోచన చెప్పి, ఆమెను ఆదరించి, ఆమెతో ప్రార్థించాము. అంతమాత్రమే గాక నేను చేసిన ప్రసంగాలను ఆమె టేపురికార్డు మీద విని, నా పుస్తకములు చదివి ఆదరణ పొందింది. ఇప్పుడు ఆమె ఒక మంచి వ్యక్తితో వివాహములో జతపర్చబడి నాతో కలిసి పరిచర్యలో ముందుకు సాగుతుంది.

## యేసువైపే చూడు – నీదృష్టి మళ్లించవద్దు

"విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచు, మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము... మీరు అలసటపడకయు, మీ ప్రాణములు

విసుకకయు ఉండునట్లు, పాపాత్ములు తనకు వ్యతిరేకముగ చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి.”

హెబ్రీ 12:1-3

జీవితయాత్రలో ఒక ప్రక్కన పడిపోయి ఇక ఇక్కడే ఉంటాను, నేను లేవను. నా ఆత్మీయ జీవితానికి స్వస్తిచెబుతున్నాను అని చెప్పడానికి ఏ ప్రత్యేకమైన చాకచక్యము అవసరములేదు.

ఏ అవిశ్వాసియైననూ అట్లు చెప్పగలడు. నాకు ఈ స్థితి వద్దు అని చెప్పేవారు కేవలము విశ్వాసులు మాత్రమే కాదు. అయితే నీవు యేసును పట్టుకుంటే లేక యేసు నిన్ను తన వశములో ఉంచుకుంటే ఆయన తన శక్తిని, ఆదరణను, ఉత్సాహమును నీలో నిండారులుగా దయచేస్తాడు. ఆశ్చర్యకరమైన సంగతులతో నింపి, నిన్ను ఆయన నుండి దూరముగా పోనివ్వడు.

“ప్రభువా, నన్ను వదలిపెట్టు. ఈ జీవితములో నేను కొనసాగలేను” అని నీవు చెప్పవచ్చు గాని ఆయన నిన్ను విడువడు.

నేను కూడా ఒకప్పుడు ఈ జీవితము చాలించుకుందాము అనుకున్నాను. కాని ఇప్పుడు ఉదయాన్నే పడకనుండి లేవగానే నూతనమైన వ్యక్తివలె సేదదీరిన దానివలె ఉంటున్నాను. ప్రార్థనలో, బైబిలు ధ్యానములో నిమగ్నురాలనై, వాక్యమును నోటితో వల్లిస్తాను. దేవుని వెదకుచు ఉంటాను.

“ఇట్టి జీవితము వలన ఏమి లాభము? సంవత్సరాలకొలది ఇట్లు చేస్తూనే యున్నావు. నీకున్న ఫలాని సమస్య తొలగిపోలేదు కదా?” అని సాతాను నా చెవిలో పెద్దగా అరచి చెప్పవచ్చు.

అపవాదితో నేను ఈ విధంగా జవాబిస్తాను. “సాతానా! నీ నోరు మూసుకో! బైబిలు చెప్పిన రీతిగా నేను యేసువైపు చూచి ఆయనను అనుసరించాలి. ఆయనే నా నాయకుడు, నా విశ్వాసమునకు మూలకర్త, దానిని కొనసాగించువాడు ఆయనే.”

నా కుమార్తె కూడా తన ఆత్మలో ఆదరింపబడుటకు జరిగిన దానిని తలంచక ముందుకు సాగిపోవుటకు ఆ విధంగానే చేసింది. ఇదివరకు జరిగిన వాటి దృష్ట్యా తాను "అబ్బా! మళ్లీ అంతే జరిగిందే. ఇదివరకు రెండుసార్లు అట్లు జరిగింది. మళ్లీ మూడోసారి కూడా అంతే జరిగిందే" అని ఆమె తలంచలేదు. ఆమె యేసుప్రభువు వైపే తన చూపు మళ్లించింది.

నీవు, నేను కూడా మన జీవితాల్లో ఏమి సంభవించినా మన విశ్వాస జీవితంలో ముందుకు కొనసాగిపోదుము గాక!

## పునఃప్రారంభించు

"ఏడ్చువారితో ఏడువుడి; ఒకనితో నొకడు మనస్సు కలిసియుండుడి. హెచ్చు వాటియందు మనస్సుంచక తగ్గువాటి యందు ఆసక్తులై యుండుడి. మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు."

రోమా 12:16

ఇటీవల దేవుడు జీవితంలో నాకేమి చేశాడు, నా సేవా పరిచర్యలో ఆయన జరిగించినదేమియని తలంచుచుంటిని. దానినంతటిని నా ఆకళింపునకు తెచ్చుకొనగా నాకెంతో ఆశ్చర్యం కల్గింది. అయితే ఆ సంగతులు అట్లు జరుగుట సుళువైన పనేమి కాదు. అనేకసార్లు ఇక ఈ పని చేయకుండా మానుకుందామా అనుకున్న ఘడియలు కూడా నా జీవితంలో లేకపోలేదు.

నేను కృంగిపోయి, నిరాశలో మునిగిపోయినప్పుడు, ప్రభువు ఎట్లు నన్నాదరించేవాడో నేనెన్నోసార్లు మీతో చెప్పాను. "జాయిస్, నీకు నిరాశ కల్గినప్పుడు నీవు పునఃప్రారంభించాలి. అట్లు చేయకపోతే నీవు నిరుత్సాహ వంతురాలవౌతావు. ఆ నిరుత్సాహము నిన్ను నాశన పాత్రురాలుగా చేస్తుంది" అని ఆయన నాతో అంటాడు.

కనుక మనము పరిస్థితులకు అనువుగా మనలను మనము సరిదిద్దుకోవాలి. నాకుమార్తె కూడా అలాగే చేసింది. నూతనమైన, ప్రత్యేకమార్గములోనికి ఆమె మళ్లుకోగలిగింది. అది అంత సుళువైన పనికాదు.

వనభోజనమునకు వెళ్లినప్పుడు వర్షం కురిసినందుకు సర్దుకోవడం సుళువే గాని, నిశ్చితార్థము ఒక వ్యక్తితో జరిగిన తరువాత దానిని విడిచిపెట్టుట అంత సుళువేమికాదు. అయితే పరిస్థితులు ఎటువంటివైనా దానికి పరిష్కారమార్గము ఒకే ఒక్కటి.

మనము పునఃప్రారంభించడానికి నేర్చుకోకపోతే, మారిన పరిస్థితులకు అనుగుణంగా నడుచుకొని నూతన మార్గమునకు మనము అలవాటు పడకపోతే, దేవుడు మనకొరకు దాచియుంచిన అద్భుతమైన ఆసక్తికరమైన జీవితమును అనుభవించలేము.

# 6

# దేవుని గూర్చిన సంగతులను ధ్యానించండి

"దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి.

అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును."

ఫిలిప్పీ 4:6-7

నీకు కలిగిన నిరాశలవలన నాశనమునకు పోకుండా ఉండాలని నీవు ఇష్టపడితే, నీ నిరాశలను గూర్చి తలంచుకొనవద్దు.

నీవు హృదయములో అనుభవించే అనుభూతులే నీ తలంపులకు జన్మనిచ్చునని నీవు ఎరుగుదువా? నేను చెప్పేది నిజము కాదనుకుంటే, 20 నిమిషాలపాటు ఆలోచించిన తరువాత నీ అనుభూతులు మారిపోయి, నీ ముఖ వర్చస్సు కూడా పూర్తిగా మారిపోతుంది. నీవు కోపంతో నిండి, కృంగిన స్థితిలోనికి దిగజారిపోయినప్పటికీ, నీ పరిస్థితులలో మార్పేమి కలుగదు.

అట్టి విరుద్ధ ఆలోచనలు కల్గినవాడవై, ప్రార్థన మందిరానికి వెళ్లి, పాటలు పాడి, ప్రసంగాలు విన్నప్పటికీ నీవు ఇంటినుండి వెళ్లేటప్పుడు ఏ మనస్సుతో వెళ్లావో అదే మనస్సుతో తిరిగి వస్తావు. ఎందుకంటే నీ మనస్సులో దేవుని గురించి తలంచే బదులుగా, నీ సమస్యలపైనే నీదృష్టి కేంద్రీకరించావు.

## నీ సహవాసులెవరు?

నేను ప్రచురించే మాసపత్రికలో "నీవు స్నేహము చేయునది, ప్రభువుతోనా? లేక నీ సమస్యతోనా?" అన్న ప్రశ్న వేశాను.

అట్లు ప్రశ్నించుటకు కారణమేమనగా ప్రభువు నన్ను ఒక ఉదయం అదే ప్రశ్న అడిగాడు. ఆ రోజు నాకింకా జ్ఞాపకముంది.

నేను ఉదయాన్నే లేవగానే నా సమస్యను గురించి తలస్తూ సతమత మౌతున్నాను. అకస్మాత్తుగా దేవుని ఆత్మ స్వరము నాతో మాటలాడాడు. ఆయన స్వరం నేను గుర్తుపట్టగలిగాను.

ఆయన నన్ను గద్దించి కోపంతో నాతో మాటలాడాడు. "జాయిస్, నీ సమస్యతోనే సహవాసం చేస్తావా? లేక నాతోనా?" ఆ తరువాత ఆయన ఇట్లన్నాడు. "నీ సమస్యల గురించి మదనపడవద్దు" అని ఆయన నాతో అన్నాడు.

నీకు నిరాశకల్గినప్పుడు, ఆ నిరాశతోనే ఒక దగ్గర కూర్చుండి దానిపైననే ధ్యానం ఉంచడానికి ప్రయత్నించవద్దు. నీవెంత మదనపడినా మామూలు వ్యక్తిలాగానే ఉంటావు.

ఈ సత్యం తెలుసుకోవడం కష్టం. ఎందుకంటే అపవాది, లోకంలో మనకే అంత గొప్ప నష్టం వాటిల్లిందని చెప్పుటకు ప్రయత్నిస్తుంటాడు.

కాని వాడు చెప్పేది నిజంకాదు.

ఒకసారి నేను నా కుమార్తె యొద్ద కూర్చుండి, నాకు 18వ ఏటనుండి, 23 ఏళ్ల వరకు ఏయే సంగతులు దేవుడు నా జీవితంలో చేశాడో వాటన్నిటినీ ఆమెకు వినిపించాను. ఆ మాటలు విన్న తరువాత "ఆ సంగతులు నాకు ఎంతో దీవెనకరంగా ఉన్నవని" ఆమె నాతో చెప్పింది.

ఆమె జీవితంలో అందరి జీవితంలో జరిగినట్లే దురదృష్టకరమైన సంగతులు జరిగాయి. ఇక నా సంగతి చెప్పాలంటే అది ఒక సుదీర్ఘమైన భయంకర పరిస్థితి మాత్రమే. నేను ఈ సంగతి నా కూతురుతో చెప్పాను.

"నాకు 18 లేక 19 సంవత్సరాల వయస్సులో ఒకే గదిలో, ఓక్ లాండ్–క్యాలిఫోర్నియాలో ఉండేదాన్ని. అది మా యింటినుండి మూడువేల కిలోమీటర్ల దూరం. నాకు ఒక కారులేదు, టెలిఫోను లేదు. టి.వి. లేదు. నన్ను గురించి పట్టించుకొనేవారే లేరు. ఒక్క దానినే కూర్చొని విషాదంతో నిండిన పద్యాలు వ్రాస్తూ కూర్చుండిపోయేదానను. ఇక ఉదయాన్నే లేచి మళ్లీ నా పనికి పోయేదానను.

దేవునికి స్తోత్రము. నీకు ఒక కుటుంబము, ఒక ఉద్యోగము, ఒక ఇల్లు, ఒక కారు ఉంది. వీటిలో యేది ఆ దినాల్లో నాకు లేదు."

నా మాటలు విన్నప్పుడు, నా కుమార్తె తన ప్రస్తుత స్థితిని తనకు రాబోయే ఉన్నతమైన స్థితిని ఊహించుకొని ఎంతో సంతోషపడింది.

ఆదేరీతిగా మనం కూడా, మనకు రాబోయే విషయాలగూర్చి తలంచుకొని ఊరట చెందాలి. అయ్యో, నాకేమీ లేదే అని నీవనుకొంటే నిరుత్సాహం నీలో పెల్లుబుకుతుంది.

మనకు లేనివి రావు. అయ్యో, ఏమీ లేవే అనుకుని మదనపడుటవలన అవి రావు. అవి నాకు వస్తే బాగుండు, అనుకున్నా అవి రావు గదా! మనం నిరాశను, నిరుత్సాహాన్ని దానివలన కలిగే వినాశనాన్ని తొలగించుకోవాలంటే నిజమైన సంగతులను బేరీజు వేసుకోవాలి.

## ఈ సంగతులను గూర్చి ఆలోచించండి

> "మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యానముంచుకొనుడి."
>
> ఫిలిప్పీ 4:8

ఈ భాగంలోని 6,7 వచనాలలో మనకు చెప్పబడినదేమనగా, మనలను బాధించే ఏ సమస్యను గూర్చి చింతపడకూడదు గాని ప్రార్థనాపూర్వకంగా దానిని దేవునికి తెలియజేయాలి. ఆ విధంగా మనం చేసినప్పుడు దేవుని సమాధానము మనలో ఉండి, ప్రతివిధమైన నిరాశను, చింతను రానివ్వక మన మనస్సులను, హృదయాలను కాపాడునన్న నిశ్చయత మనకివ్వబడింది.

దేవుని యొక్క అద్భుతమైన సంతోషం, సమాధానం మనం అనుభవించాలంటే మనం చేయవలసిన మరియొక విషయం 8వ వచనంలో చెప్పబడింది. మనం మన తలంపుల పరిధిని మన అదుపులో ఉంచుకొని, విరుద్ధభావాలవైపు మన తలంపులను పోనివ్వక ఆశాజనకమైనస్థితిలోనే వాటిని ఉంచుకోవాలి.

మొదటిగా మనకు చెప్పబడినదేమనగా ఏది సత్యమైందో దానిపై మన గమనముంచాలి. అంటే ఇదివరకు మనకు కొన్ని చెడుసంగతులు జరిగాయి. గనుక వాటిమీద లక్ష్యముంచాలని అర్థంకాదు.

సత్యానికి, జరిగిన సంగతికి తేడా ఉంది. ఇదివరకు జరిగిన సంగతులు వేరు, సత్యము వేరు. యేసుక్రీస్తు, ఆయన వాక్యము సత్యమైనది. అవి ఇదివరకు మన జీవితాలలో జరిగినవాటికంటే గొప్పవి.

మా స్నేహితురాలి జీవితాన్ని గురించి ఒక ఉపమానం ద్వారా నేర్చుకుందాము. ఆమె భర్త చనిపోయి ప్రభువుతోనుండుటకు పరలోకానికి వెళ్లాడు. అయితే నా స్నేహితురాలు కూడా అక్కడికి వెళ్లితేనే తప్ప ఆయనను మళ్లీ చూడలేదు.

అది నిజమే.

అయితే ఆమె తెలిసికొనవలసిన సత్యమేమనగా ఆమె జీవితము ఇంకా ముగింపులోకి రాలేదు. ఆమె దేనికోసం జీవించాలన్న మీమాంస కలిగియుండకూడదు. అపవాది ఈ సంగతులపై ఆమె తన దృష్టినుంచాలని కోరుతాడు కనుక ఆమె వాని మాటలు నమ్మకూడదు.

నా కుమార్తెతో నిశ్చితార్థం చేయబడిన యౌవనస్తుడు ఆమెతో అబద్ధం చెప్పి ఆమెను బహుగా గాయపరిచాడు. అది నిజం. అయితే సత్యమేమనగా, ఆ నిరాశతో ఆమె జీవితం అంతమైపోలేదు. సత్యమేమనగా ఆమె నిండు జీవితం ఇంకా ముందుకు కొనసాగి దీవెనలతో నిండి పొర్లవలసి ఉంది.

నిజమేమనగా ఆమె తన ప్రియుని పోగొట్టుకొంది. సత్యమేమనగా ఆమె భవిష్యత్తు భద్రంగా ఉంది. ఒక మంచి క్రైస్తవ కుటుంబము, ఇల్లు, మంచి ఉద్యోగము, ఆమెను ప్రేమించే స్నేహితులు వీటన్నిటికీ పైన దేవుని ప్రేమ ఆమె స్వంతం కానున్నవి. ఇది సత్యం.

ఆమెకు 19వ జన్మదిన కానుకగా గొప్ప నష్టం వాటిల్లింది. అయితే ఆమె తన దృక్పథం మార్చుకుంది. ఇప్పుడామెకు జరిగిన దానిపై దుఃఖముగాని, కక్షగాని లేదు.

“రేపు నా పందొమ్మిదవ జన్మదినమే. కాని నా శేష జీవితానికది మొదటి దినము” అని ఆమె చెప్పింది.

ఆ మాటలకు నేనెంతో ముగ్దురాలనై, ఒక డైరీ(దినచర్య) ని ఆమెకిచ్చి, “ఈ సంవత్సరం దేవుడు నీ జీవితంలో చేసిన అద్భుతాలను దీనిలో వ్రాసికొమ్ము. నీ 20వ జన్మదినాన వాటన్నిటినీ చదివి పండుగ ఆచరిద్దాము” అని చెప్పాను.

ఆ తరువాత ఆ విధంగానే చేశాము.

నీవు, నేను ఆ విధంగానే చేయాలి. నిరాశలు కలుగకుండా మనం నివారించలేము గాని, అవి కల్గినప్పుడు మన ప్రవర్తనను అదుపులో పెట్టుకొనే శక్తి మనకుంది.

వాటి మీదనే తలంపులను కేంద్రీకరించితే మనం పూర్తిగా నిరుత్సాహంలో మునిగిపోతాము. అయితే మన జీవితంలో కల్గిన అనేక మేళ్లను గురించి రాబోయే దినాలలో దేవుడు చేయబోవు మేళ్లను గురించి మనం తలంచుకోవాలి.

# 7

# నిరీక్షణ మరియు రాబోవు మేలుల కొరకైన ఎదురుచూపులు

“ఏ విధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణవిషయములో సమానానుభవముగలవాడనై, ఆయనను ఆయన పునరుత్థానబలమును ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను.”

ఫిలిప్పీ 3:10

ఈ పై వచనంలో పౌలు దేనిని తాను చేశానని చెప్పాడో, దానిని మనమందరము చేయబద్ధులమైయున్నాము. అతడు తన ముందర ఒక గురి కలిగియున్నాడు.

నీవు, నేను కూడా, ఒక గురి, కల్గియుండాలి. ఒక నిరీక్షణ, ఒక నిర్దిష్టమైన దిశ, జీవితంలో మేలు కలుగునన్న ఎదురుచూపు కలిగియుండాలి.

పలుమార్లు జీవితంలో నిరాశలు కలిగియుండుటవల్ల ప్రజలు తమ గమ్యాన్ని కోల్పోయి అయోమయ స్థితిలోనికి జారిపోతారు. వారు అధైర్యపడి, దేనిమీదనైనను, ఎవరిమీదనైననూ నమ్మకముంచలేరు. మళ్లీ నిరాశ కలుగునేమోయని మేలును కాంక్షించరు. నిరాశకల్గించు బాధకు భయపడి మళ్లీ అదే బాధ రాకుండా కాపాడుకొనుటకు విశ్వాసం లేనివారుగా మిగిలిపోతారు.

ఆ విధంగా వారు నిరాశలో మునిగిపోవుట వల్ల, జీవిత నాటకరంగంలో వారు ఓడిపోయినవారుగా మిగిలిపోతారు. ఎందుకంటే విజయమనేది, ధైర్యవంతులనే వరిస్తుంది.

## నష్టము కల్గినప్పుడు అపనమ్మకం కలుగుతుంది

> "ఏ విధముచేతనైనను మృతులలో నుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణవిషయములో సమానానుభవము గలవాడనై, ఆయనను ఆయన పునరుత్థానబలమును ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను."
>
> ఫిలిప్పీ 3:11

ఒక బాలిక ఒక వ్యక్తి ద్వారా రెండు, మూడు పర్యాయములు మోసగించబడితే, "నేను ఎప్పుడు ఎవరినీ నమ్మను" అని అనుకుంటుంది.

మనందరం అలాగే అనుకోవాలని సాతాను యొక్క కోరిక.

మన స్నేహితులు మన విషయంలో తప్పిపోయినప్పుడు "నేను ఇంక ఎవరిని ఎప్పుడు నమ్మను" అని చెప్పుకో అని సాతాను మనలో తలంపులు పుట్టించును.

మనం నిజంగానే ఆ విధంగా తలస్తే సాతాను చేతుల్లోకి పోయినట్లవుతుంది.

"నీకు నష్టం వాటిల్లితే నీవు అపనమ్మకంతో నిండిపోతావు" అంటారు.

అది నిజమే కావచ్చు. కాని ఆ విధంగా అపనమ్మకస్తులమైతే సాతాను చేత మోసగించబడి, దేవుడిచ్చిన జీవిత గమ్యాన్ని చేరుకోలేము.

మనము ఎవరివలన మోసగించబడ్డామో వారివలెనే లోకంలోని మనుష్యులందరు ఉంటారని నమ్మేట్లు సాతాను కోరుతాడు.

కాని మనుష్యులందరూ ఆలాగుండరు.

సాతాను కొన్ని చెడు ఉదాహరణలు మనకు చూపి లోకములో ఎవరినీ నమ్మకూడదన్న మనస్సు కల్గిస్తాడు.

ఎవరివల్లనైన నీవు నష్టపోతే ఎవరినీ నమ్మకూడదని అనుకోవద్దు. నీవు అట్లు అనుకుంటే దేవుడు నీకు సిద్ధపరచిన అనేక ఆశీర్వాదాలు పోగొట్టుకుంటావు.

అపోస్తలుడైన పౌలుకు జీవితంలో ఒక గురి ఉంది. అది అతనికి ఆత్మీయమైన కల. జీవితంలో ఏమి సంభవించినాసరే దేవుని ఉద్దేశములను తాను జరిగించుటలో వెనుకంజవేయనని తాను నిర్ణయించుకొన్నాడు.

ఆ గురి నెరవేర్చుటకు ఎన్నో పాట్లు తాను పడవలసి వచ్చింది. దానికొరకై దేవుని మాత్రమే గాక, మనుష్యులను కూడా నమ్మవలసి వచ్చింది. తాను నష్టపోతానేమో శ్రమపడవలసివచ్చునేమో అని అనుకున్నప్పటికీ, ఇతరులకు తన్నుతాను అప్పగించుకొనవలసివచ్చింది.

నీవు గాని, నేనుగాని పోవలసిన మార్గమిదే. మనలను నిరుత్సాహపరచుటకు సాతాను మనత్రోవలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా, మన మార్గంలో పోతూనే

ఉండాలి. వదలిపెట్టి వెనుకకు తిరుగకూడదు. గమ్యాన్ని చేరుకొనుటకు అడ్డ త్రోవలు తొక్కకూడదు.

## ముందుకు సాగిపొమ్ము

"ఇదివరకే నేను గెలిచితిననియైనను, ఇదివరకే సంపూర్ణ సిద్ధి పొందితిననియైనను నేను అనుకొనుటలేదు గాని, నేను దేనినిమిత్తము క్రీస్తు యేసుచేత పట్టబడితినో దానిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను.

సహోదరులారా, నేనిదివరకే పట్టుకొనియున్నానని తలంచుకొనను.

అయితే ఒకటి చేయుచున్నాను; వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను."

ఫిలిప్పీ 3:12-14

12వ వచనములో పౌలు మనతో చెప్పినదేమనగా తాను తన గమ్యాన్ని చేరుకోలేదని, తాను ఆశించినది తనకు దొరకలేదు అని అంటున్నాడు. అంత మాత్రాన తన ప్రయత్నాన్ని మానుకోలేదు. అయితే ఆ మార్గంలో ముందుకు సాగిపోతున్నాడు.

ఆ తరువాత 13వ వచనంలో తాను ఒకటి చేయుచున్నాను అని చెబుతున్నాడు. ఆ ఒక్కటి మనకు ఆసక్తిదాయకమైనది, అది ఎంతో ప్రాముఖ్యమైనది కూడా. ఎందుకంటే ఈ చెప్పబోయే మాట, క్రొత్త నిబంధన పుస్తకాలలో పరిశుద్ధాత్మ ప్రత్యక్షత ద్వారా మూడింట రెండు భాగములు వ్రాసిన వానిచే చెప్పబడింది.

గొప్ప అపోస్తలుడైన పౌలు తాను కన్నకలలు నిజం చేసుకోవడానికి, నిర్ణయించుకున్న గమ్యములు చేరుకోవడానికి తన జీవితంలో అలవరచుకొన్న ఆ గొప్ప సూత్రమేది?

ఆ సూత్రానికి రెండు భాగములున్నవి. మొదటిది, గతంలో తన వెనుకవిడిచిన దానిని మరచిపోవుట. రెండవది, భవిష్యత్తులో తాను చేయవలసిన దానికోసం ముందుకు వేగిరపడుచు వెళ్లుట.

మనమందరము నేర్చుకోవలసిన ప్రాముఖ్యమైన పాఠము ఇదే.

ఉదాహరణకు తన భర్తను పోగొట్టుకున్న స్త్రీ విషయమై ఆలోచించండి. ఈమె విషయంలో గతంలో జరిగిన తన భర్త మరణమును మరచి, ముందున్న దానికొరకు వేగిరపడుటయనగా ఆమె తన భర్త విషయమై పూర్తిగా మరచిపొమ్మని అర్థంకాదు. ఆమె తన గత జీవితంమీదనే దృష్టి కేంద్రీకరించితే ఆమె గొప్ప వేదనతో నిండియుంటుంది. ఆ విధంగా ఆమె గతాన్ని తలంచుకొనుచూ ముందు తాను చేయవలసిన కార్యక్రమంలో వెనుకబడిపోతుంది.

మా సంఘములో ఒక స్త్రీ యొక్క కుమారుడు తన 16వ యేట లుకోమియా వ్యాధితో చనిపోయాడు. మేమందరము ప్రార్థించి అతని విషయమై దేవునియందు విశ్వాసముంచాము. అయినను అతడు చనిపోయి ప్రభువును చేరుకున్నాడు. అట్టి విషాదపరిస్థితిలో సయితము ప్రభువు ఆ తల్లిని ఆదరించాడు.

జ్ఞాపకార్థకూడిక తరువాత ఒకరోజు ఆమె బట్టలు ఉతికి, చలువచేయునప్పుడు ఆమె తన కుమారుని చొక్కాయి చూచింది. ఆమె దానిని పైకిత్తి దానిని తన గుండెకు హత్తుకొని ఓదార్పు పొందనొల్లక ఏడ్చెను. ఆ తరువాత ఆమె చెప్పినదేమనగా దుఃఖము ఆమెను తన వశములో ఉంచుకొన్నదని చెప్పెను.

ఆ సమయములో తాను స్పృహలోనికి వచ్చి యేసు నామమును వల్లించెను. ఆ తరువాత ఆమె ఆ చొక్కాయి పైకెత్తి "సాతానా, ఈ చొక్కాను నేను స్తుతి

వస్త్రముగా ఉపయోగించుకుంటాను. నేనిక దుఃఖములో మునుగను. కానీ, స్తుతితో తేలియాడెదను" అని బిగ్గరగా చెప్పింది.

గతాన్ని గూర్చి కొంత బాధపడడము జరుగుతుంది. కాని అది కొద్ది సమయానికే పరిమితమైయుండాలి. సందర్భానుసారంగా ఉండాలి. అయితే తొందరగానో, ఆలస్యంగానో దానిని మన వెనుకకునెట్టి ముందున్న విషయాలకోసం సాగిపోవాలి. వెనుక ఉన్న వాటిని లక్ష్యపెట్టక, ముందున్న వాటి కొరకు వేగిరపడుట అని చెప్పినప్పుడు పౌలు మనలోని అసంపూర్ణతలను ఎత్తి చూపుచున్నాడు. అయితే ఈ సూత్రము జీవితములో అందరికీ అన్వయింపతగినది.

దేవుడు దేనికొరకు మనలను పిలిచి, అభిషేకించి, నెరవేర్చమని ఆజ్ఞ ఇచ్చాడో దానిని మనం గమ్యంగా కలిగి, దానివైపే వేగిరపడి ముందుకు సాగిపోవాలి.

# 8

# ఒక నూతన క్రియ

“మునుపటివాటిని జ్ఞాపకము చేసికొనకుడి పూర్వకాలపు సంగతులను తలంచుకొనకుడి.

ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను. ఇప్పుడే అది మొలుచును మీరు దాని నాలోచింపరా? నేను అరణ్యములో త్రోవ కలుగజేయుచున్నాను ఎడారిలో నదులు పారజేయు చున్నాను.”

యెషయా 43:18-19

గతంలో జరిగిన సంగతులు ప్రభువును స్తుతించుటకే దోహదకారులౌనట్లు చూచుకోవాలి కానీ, దుఃఖించుటకు, బాధకరమైన తలంపులకొరకు దానిని జ్ఞాపకము చేసికోకూడదు. ముందుకు జాగ్రత్త కల్గియుండే దానికి అవి సాయపడాలి.

నేను నా స్వంత పరిచర్య ప్రారంభించుటకుగాను పాస్టరు ఉద్యోగం మానుకోవలసి వచ్చింది. అట్లు అనేకులతో నాకున్న సత్సంబంధాలు వదలుకోవడం నాకెంతో బాధ కల్గించింది. మేమందరం కలిసి చేసిన సేవ యొక్క జ్ఞాపకాలు చాలాకాలం వరకు నన్ను విడిచిపోలేదు.

ఆ సమయంలో నా గతాన్ని విస్మరించవలసి వచ్చింది. నా మనస్సు, భావోద్రేకాలు గతాన్ని పెనవేసికొని నన్ను బాధిస్తూ ఉండేవి. చివరకు నా భవిష్యత్తు విషయమైన తలంపులు నన్ను ఉద్రేకపరచుట వల్ల నేను గతాన్ని జయించగలిగాను. నా పాత ఉద్యోగం నాకు అచ్చటి ప్రజలతో ఉన్న సంబంధ బాంధవ్యాలు నా జ్ఞాపకాన్ని అంత తేలికగా విడిచిపెట్టలేదు.

అట్టి నిరాశ నా నూతనపరిచర్యలోని ఆనందోత్సాహాలపై ప్రభావం చూపించింది. అది నాకెంతో కలవరం కల్గించిన సమయం. కానీ దానివల్ల వెనుక ఉన్నవాటిని మరచుచూ ముందున్న వాటికై ఎట్లు వేగిరపడాలో నేర్చుకున్నాను.

మరిముఖ్యంగా, దేవుడు నాతో "నీవు పాత జీవితాన్ని జీవించుటకు వీలులేదు. గతం ఇక నీ జీవిత ధ్యేయంకాదు. నేనొక నూతన క్రియను నీ జీవితంలో చేయుదును" అని ఆయన నాకు జ్ఞాపకం చేశాడు.

## "నేను ఉన్నవాడను"

"అందుకు దేవుడు నేను ఉన్నవాడను అను వాడనై యున్నానని మోషేతో చెప్పెను మరియు ఆయన—ఉండునను వాడు మీ యొద్దకు నన్ను పంపెనని నీవు ఇశ్రాయేలీయులతో చెప్పవలెననెను.

మరియు దేవుడు మోషేతో నిట్లనెను—మీ పితరుల దేవుడైన యెహోవా, అనగా అబ్రాహాము దేవుడు ఇస్సాకు దేవుడు యాకోబు దేవుడునైన యెహోవా మీ యొద్దకు నన్ను పంపెనని నీవు

ఇశ్రాయేలీయులతో చెప్పవలెను. నిరంతరము నా నామము ఇదే, తరతరములకు ఇది నా జ్ఞాపకార్థ నామము.”

నిర్గమ 3:14-15

నీవుగాని, నేనుగాని గతాన్ని చాలకాలం పెనవేసికొని ఉంటే అది మనలను కష్టపరిస్థితులలోనికి నెట్టివేస్తుంది. కనుక, ప్రతి సమయంలో, దేవుడు మోషేకు జ్ఞాపకం చేసినట్లు “నేను ఉన్నవాడను” (ప్రస్తుతానికి సంబంధించినవాడను); “నేను గతాన్నికాదు” అని మనకు కూడా జ్ఞాపకం చేస్తున్నాడు.

దేవుడు గతంలో మనకు చేసిన మేళ్లన్నిటినీ మనం తలపోసికోవాలి. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు విషయంలోను బైబిలులో తనకు నమ్మకంగా జీవించిన స్త్రీ పురుషులకు కలిగించే మేళ్లు ఆయన మన జీవితంలో కూడా జరిగించాడు. అయితే గతంలోని సంతోషాలు, విజయాలు మన మనస్సును ఆక్రమించుకొని, దేవుడు ఇప్పుడు మన జీవితంలో ఏమి చేయుచున్నాడో దానిని మనం మనస్సునపెట్టకపోతే అది సరియైన పద్ధతికాదు. ఆయన మనకొరకై భవిష్యత్తులో ఏమి చేయనైయున్నాడోనన్నది కూడా ప్రాముఖ్యమే.

యోహాను 8:58లో “యేసు—అబ్రాహాము పుట్టకమునుపే నేనున్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను” అని వ్రాయబడింది. హెబ్రీ 13:8 లో “యేసుక్రీస్తు (మెస్సీయ) నిన్న నేడు ఒక్కటే రీతిగా ఉన్నాడు, అవును యుగయుగములకు ఒక్కటే రీతిగానుండును” అని వ్రాయబడింది. మన విశ్వాసము కూడా ఎల్లకాలముండేదిగా నిత్యత్వమునకు సంబంధించి, కాలానుగుణ్యముగా కాక, మారనిదైయుండవలెను.

## వెనుకకు తిరిగి చూడవద్దు

“యేసు—నాగటిమీద చెయ్యిపెట్టి వెనుకతట్టు చూచు వాడెవడును దేవుని రాజ్యమునకు పాత్రుడుకాడని వానితో చెప్పెను.”

లూకా 9:62

మనం గతంలో జీవించకూడదు. మనము ఒకవేళ వెనుకటి చరిత్రలోనికి వెళ్లి అప్పటి పరిస్థితులను పునరుద్ధరించి అక్కడ జీవించవలెనని కోరిననూ, ఆ పరిస్థితులు కూడా మారిన పరిస్థితులుగానే యుండును. దానికి కారణం నీకు తెలుసా? అప్పటి దినాలకు, ఇప్పటి దినాలకు ఏ విధంగా చూచినా వ్యత్యాసం ఉంటుంది కదా!

నిన్నటిదినం గతించింది. కాలగతిలో అది వెనుకబడిపోయింది. ప్రస్తుతము అనేది ఇప్పుడు మనం జీవించేస్థితి. మన దేవుడు ఇప్పుడున్నవాడు. మనం కూడా ఇప్పుడున్న ప్రజలమే. ఇప్పటి జీవితమే మనం జీవించాలి, అనగా రోజువారీ జీవితం జీవించాలి.

గతంలో వారికి సంతోషం కల్గించినవి ఇప్పుడు లేవేయని కొందరు సంతోషం లేనివారుగా ఉంటారు. మరికొందరు ఇదివరకు దేవుడు వారిపక్షంగా ఉండేవాడని ఇప్పుడావిధంగా ఆయన సాయం చేయుటలేదని వారు చింతపడతారు.

అటువంటి పరిణామాలుండవు. మనం ప్రస్తుతంలో జీవించుటకు నేర్చుకోవాలి. ప్రభువు మన పక్షంగానున్నాడు. ఆయనలో మనం సంతోషంగా ఉందాము. మనం గతాన్ని మన వెనుకకు నెట్టి మనలను దేవుడిప్పుడు ఎట్లు నడిపిస్తున్నాడో దానిలో జీవిద్దాము. మనకొరకు దేవుడు దేనిని సిద్ధపరచాడో దానికొరకు ముందుకు సాగిపోదాము. మనం నాగటిమీద చేయిపెట్టి ఇక మనకు ముందెన్నడు జరుగని సంగతులవైపు తిరిగి చూడకుందుము గాక!

## వెనుకకు తిరిగి చూద్దామా లేక ముందుకు సాగిపోదామా?

"ఈలాగు చెప్పువారు తమ స్వదేశమును వెదకుచున్నామని విశదపరచుచున్నారు కారా? వారు ఏ దేశమునుండి వచ్చిరో ఆ దేశమును జ్ఞాపకమందుంచుకొన్నయెడల మరల వెళ్లుటకు వారికి వీలు కలిగియుండును.

అయితే వారు మరి శ్రేష్టమైన దేశమును, అనగా పరలోక సంబంధమైన దేశమును కోరుచున్నారు. అందుచేత తాను వారి దేవుడనని అనిపించుకొనుటకు దేవుడు వారిని గూర్చి సిగ్గుపడడు; ఏలయనగా ఆయన వారికొరకు ఒక పట్టణము సిద్ధపరచి యున్నాడు.”

హెబ్రీ 11:14-16

తమ గృహములనుండి బయటికి నడిపింపబడి, తాము చేరుకోవలసిన నూతన గృహమునకు వెళ్లకముందు త్రోవలో కొన్ని కష్ట సమయాలను ఎదుర్కొన్న ఇశ్రాయేలీయులను గూర్చి ఈ వాక్యభాగము వివరించుచున్నది.

వారు ఏయే గృహాలనుండి బయలుదేరివచ్చారో ఆ గృహాలను గురించి బెంగకలిగినవారైతే, ఆ గృహాలకు మళ్లీ మరలిపోవుటకు వారికి ఎంతో వీలు కలిగేది. అయితే వారు దేవుడు వారికొరకు సిద్ధపరచిన నూతన గృహములను చేరుకొనుటకు, అనేక అడ్డంకులున్ననూ ముందుకు సాగిపోయారు.

నీవు, నేను కూడ అట్టి ఎంపిక చేసికోవాలి. ఇంటిబెంగ పెట్టుకొని వెనుకకు తిరిగిపోవుదుమా? లేక నూతనమైనదియు, దేవునిచే సిద్ధపరచినదియునైన దానికొరకు ఆనందకరమైన నిరీక్షణ కలిగి, ముందుకు పోవుదుమా? ఎంపిక చేసుకొనే అధికారము మనదే.

మనం గతించిన దినాలలో అనుభవించిన మేళ్లను గురించి మనస్సునకు తెచ్చుకోకూడదనిగాని, చనిపోయిన మన పితరులను గూర్చి జ్ఞాపకం చేసికోవద్దని గాని ఈ వాక్యభాగము యొక్క అర్థముకాదు. అయితే ఎడతెగక మన మనస్సులో హృదయంలో గతాన్ని గురించి తలపోసికొనకూడదనియు, అట్లు చేసినట్లయిన, దేవుడు మనకొరకై సిద్ధపరచిన భవిష్యద్విషయములను వదలుకొనవలసివచ్చునని దాని అర్థము.

కనుకనే వెనుక ఉన్నవాటిమీదనే మన దృష్టి ఉంచుకొని సమయము వ్యర్థము చేసికొనక, ముందున్న వాటికై వేగిరపడాలి. ఈ వర్తమానము నేటికి సంబంధించినది. అనగా ఈ రోజు మనం అనుసరించవలసిన వర్తమానం. మన జీవిత దినాలన్నీ దీనిని అనుసరించాలి.

"వెనుక ఉన్న వాటిని లక్ష్యపెట్టక" అన్నమాటలను బట్టి నేను ఇదివరకు తలంచినదేమనగా, గతించిన దినాలలో నేను చేసిన తప్పులు మరచిపోవాలేమో అనుకున్నాను. ఆ తరువాత గతించిన దినాలలో నాకు గల్గిన విజయాలను, మేలులను గూర్చి తలంచుట వలన నాకు ఎంతో మనస్తాపము కల్గినదని గ్రహించాను. ఒక సంగతి పూర్తికాగానే దానికి చరమగీతము పాడి, తరువాత కార్యక్రమం చేపట్టాలి. ఇప్పటి తప్పులను, విజయాలను గతంలోని తప్పులు, విజయాలతో పోల్చుకోకూడదు. ఆలాగు చేసినట్లయిన మనం నిరుత్సాహంతో గాని, గర్వంతో గాని నిండిపోతాము.

ఇప్పుడు మనం జీవించే జీవితమును పూర్తి స్వేచ్ఛతో అనుభవించాలి. అయితే మన జీవితమును గతించిన మన అనుభవాలతో పోల్చి చూచుకున్నందువల్ల జీవిత మాధుర్యమును అనుభవించలేము.

అందువల్లనే మన ప్రభువు యెషయా 43:18,19లో పూర్వము జరిగిన సంగతులను మనస్సులో పెట్టుకొనవద్దు అని, పాత సంగతులను గురించి ఏ ఆలోచనా చేయవద్దని చెప్పాడు. దానికి కారణమేమనగా, పాతవి గతించి పోయాయి. దేవుడు నూతన క్రియ జరిగించుచున్నాడు. అది మన యెదుటనే పైకి కనబడేదిగానున్నది. దానిని గురించి మనం ఆలోచించాలి. అప్పుడు దానిలో మనం పాలిభాగస్తులమౌతాము. అప్పుడే అది మనకు ప్రయోజనకరమౌతుంది.

## కన్నీళ్లతో విత్తుము; సంతోషముతో పంట సమకూర్చుకొనుము

"కన్నీళ్లు విడుచుచు విత్తువారు సంతోషగానముతో పంట కోసెదరు."

కీర్తనలు 126:5

గతించిన దినాలలో మనకేమి సంభవించినప్పటికినీ లేక ఇప్పుడు మనకేమి జరుగుచున్నప్పటికినీ, మన జీవితము ఇంకా అంతమైపోలేదు గదా!

నీ జీవితము అయిపోయింది అని సాతాను మనలను మోసపరచుటకు మనం ఇష్టపడకూడదు. మనము అతని స్వరము వినకూడదు.

"సాతానా, నీవు అబద్ధికుడవు. అబద్ధములన్నిటికీ నీవు జనకుడవు. ఈ రోజు నూతనమైన దినము. నేను ఈ రోజు ఒక అద్భుతము జరుగునని ఎదురు చూస్తున్నాను" అని మనం సాతానుతో చెప్పాలి.

ప్రతీరోజు, ఈ రోజు నా జీవితంలో అద్భుతం జరుగునన్న ఎదురుచూపులతో ఎందుకు బ్రతకాలి? కారణమేమనగా, ఏ రోజు దేవుడు తన అద్భుతం జరిగిస్తాడో మనకు తెలియదు. ఏ రోజు మన ప్రక్కనుండి ప్రభువు సాగిపోతాడో మనకు తెలియదు. అటువంటి ఆలోచన జీవితాన్ని చైతన్యవంతం చేస్తుంది.

మనం ఆశీర్వదింపబడే తరుణం ఎన్నడూ రాదని, మన జీవితంలో అద్భుతం ఎన్నడూ జరుగదని సాతాను మనకు చెబుతూ ఉంటాడు. అయితే యేసుక్రీస్తులో మనం వేరుపారి స్థిరపడినప్పుడు, మనకు రావలసిన తరుణం వచ్చి మన జీవితంలో అద్భుతం జరగనే జరుగుతుంది. అయితే ఆ తరుణం కోసం మనం సిద్ధపడాలి. మనం నిరాశచెంది దేవుని మీద నిరీక్షణ పెట్టుకోకుండునట్లు సాతాను మనపై చేయుదాడిని త్రిప్పికొట్టాలి. వాని దాడికి ఓడిపోయి, నిరాశపడితే మనకొరకు దేవుడు సిద్ధపరచిన దానిని పొందలేకపోతాము.

కనుకనే ప్రభువు బైబిలు అంతటిలో మనము దిగులుపడకూడదని నిరుత్సాహ పడకూడదని చెబుతున్నాడు. "ఏడ్పువచ్చి రాత్రియుండినా, ఉదయమున సంతోషము కలుగునని" ప్రభువుకు తెలియును. (కీర్తనలు 30:5).

## దేవుడు తన కార్యమును సంపూర్ణము చేయును

"గనుక మీ అందరి నిమిత్తము నేను చేయు ప్రతి ప్రార్థనలో ఎల్లప్పుడును

సంతోషముతో ప్రార్థనచేయుచు నేను మిమ్మును జ్ఞాపకము చేసికొనినపుడెల్లను నా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను."

ఫిలిప్పీ 1:6

తాను సరియైన రీతిగా ముగించలేనిది, దేవుడు ఎన్నడూ ప్రారంభించడు. ప్రారంభకుడు ఆయనే ముగించువాడు ఆయనే (హెబ్రీ 12:2).

దేవుడు సమస్యను సృష్టించడు కాని మనమే సమస్యలు తెచ్చిపెట్టుకుంటాము. మనము పాతవాటివైపు చూచి దానిలో కూరుకొనిపోయి, దేవుడు చేయు నూతన క్రియను ఈ రోజుల్లోనే ఆయన చేయుదానిని అనుభవించలేకున్నాము. దేవుడు చేయు నూతన క్రియను మనము మనస్సున పెట్టకపోవడానికి కారణమేమనగా పాతదే మంచిదని దానినే ఆధారంగా ఉంచుకొంటాము. దేవుడు నిన్న మనకోసం అద్భుతం జరిగించాడు. ఆయితే ఈ రోజు రేపు కూడా దానికి మించిన అద్భుతాలను ఆయన చేయసమర్థుడు.

అయితే మనము వేసికొనవలసిన ప్రశ్న ఏమనగా, మాకు పాత విషయాలు ముఖ్యమా? ఆయన చేయగోరిన నూతన విషయాలు ముఖ్యమా?

# 9

# క్రొత్త ద్రాక్షారసము - క్రొత్త తిత్తులు

> "ఎవడును పాతబట్టకు క్రొత్త గుడ్డ మాసిక వేయడు; వేసినయెడల క్రొత్తది దానిని చింపివేయును; అదియునుగాక క్రొత్త దానిలోనుండి తీసిన ముక్క పాతదానితో కలియదు. ఎవడును పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసము పోయడు; పోసినయెడల క్రొత్త ద్రాక్షారసము తిత్తులను పిగుల్చును, రసము కారిపోవును, తిత్తులును పాడగును. అయితే క్రొత్త ద్రాక్షారసము క్రొత్త తిత్తులలో పోయవలెను."
>
> లూకా 5:36-38

ఇటీవలి సంవత్సరాలలో దేవుడు ఈ వాక్యభాగంపై నాకు నూతన గ్రహింపు దయచేశాడు.

ఈ భాగం రక్షణయనునది కృపద్వారా మాత్రమే సాధ్యం కాని, రక్షణ ధర్మశాస్త్రం వల్ల కలుగదని బోధిస్తున్నదని నమ్మేదానను. అయితే ఇప్పుడు,

ఈ వాక్యం క్రీస్తుయేసునందు నూతన జన్మపొంది నూతన జీవితశైలి కలిగి, నూతన మనస్తత్వం గలవారికి చెందుచున్నదని నేను గ్రహించాను.

మనం నూతనమైన సంగతుల కొరకు ఎంతో ఆశిస్తాము గాని, పాత వాటినే పట్టుకొని వ్రేలాడుతుంటాము. కనుకనే ఆ విధంగా ఉంటే క్రొత్తవి మన జీవితంలో సంభవించుట అసంభవము. ఈ సంగతిని మన గ్రహింపునకు తేవాలని ఆయన 'ఎవడును పాత బట్టకు క్రొత్తబట్ట మాసికవేయడు, పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసము పోయడు' అన్న ఉదాహరణ చెప్పాడు.

## మాసిక వేయు సామెత

పాతబట్ట చినిగినప్పుడు దానికి మాసిక వేయుటకు క్రొత్త బట్ట పనికిరాదని, కుట్టుపని తెలిసిన ప్రతివానికి తెలుసు.

నీకున్న ఒక పాతదైన చొక్కాకు కొంత చినుగు ఏర్పడి రంధ్రమైనప్పుడు, అది చక్కగా ఉతికి ఆరబెట్టి, రంగు వెలిసి ఉంటుంది. కనుక దానికి క్రొత్త బట్ట మాసికవేస్తే, దినాలు గడిచేకొద్దీ క్రొత్త బట్ట కొంత నీటికి కృంగిపోయి పాతదానిని కూడా చినుగునట్లు చేస్తుంది. ఒకవేళ చింపకపోయినా క్రొత్తబట్ట పాతబట్టకు తగినట్లుగా ఉండదు. ఎందుకంటే ఉతుకులు పడినందున అది కొంతరంగు వెలిసిపోతుంది.

ఈ ఉపమానమునుపయోగించి యేసుప్రభువు మనతో చెప్పునదేమనగా, మన నూతన జీవితమును పాత బ్రతుకుతో కలిపి ఉంచవద్దు అని చెబుతున్నాడు. ఆ రెండు సరిగా అతికియుండలేవు.

ఆలాగే క్రొత్త ద్రాక్షారసమును పాత తిత్తులలో పోయకూడదు.

## వీటిలో ఏది శ్రేష్ఠమైనది?

"పాత ద్రాక్షారసము త్రాగి వెంటనే క్రొత్త దానిని కోరువాడెవడును లేడు; పాతదే మంచిదనునని చెప్పెను."

లూకా 5:39

ఒకడు క్రొత్త ద్రాక్షారసము కంటే పాతదే మంచిదని ఎందుకు అంటాడో తెలుసా? ఎందుకంటే నీవు, నేను క్రొత్త బ్రతుకుకంటే పాతదే మంచిదని అంటూ ఉంటాము కదా? అదే రీతిగావారు పాత ద్రాక్షారసమే మంచిదంటారు. పాతది సుఖమయమైన భావము కల్గిస్తుంది.

మనలో చాలామందిమి క్రొత్త జీవితం కంటే పాత జీవితమే మంచిదని దానినే కోరుకుంటాము. ఎందుకంటే దానికి అలవాటు పడిపోయాము. మనలో క్రొత్తజీవితం కోరుకొనే ఆశ ఉన్నప్పటికీ, మనం పాతదానివైపే మొగ్గు చూపుతాము. ఎందుకంటే మనకది సుఖమయంగా కనబడుతుంది.

ప్రభువుతో కలిసి నడిచేకంటే ఉన్నచోటనే ఉండడానికి ఇష్టపడతాము. ఎందుకంటే అట్టి జీవితమే మనకు సుళువనిపిస్తుంది. ఆయనతో పయనించడం కొంత కష్టతరంగా కనబడుతుంది.

ఒక క్రొత్త ఊరికి వెళ్లడం, క్రొత్త వారితో స్నేహం చేయడం, క్రొత్త డాక్టరు, క్రొత్త స్కూలు, క్రొత్త ఆరాధన స్థలం వెతుక్కోవడం అంతా కష్టతరంగానే ఉంటుంది. ఉన్నచోటనే ఉండి, ఉన్నదానితో తృప్తిచెంది, మనకు తెలిసినవే మంచివనుకోవడం అంతా బాగుంటుంది.

అయితే మనం మరచిపోయే ఒక ప్రాముఖ్యమైన విషయమేమంటే క్రైస్తవులమైన మనం నూతనమైన వ్యక్తులము.

## క్రొత్త సంగతులు సంభవించినవి

"కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను."

2 కొరింథీ 5:17

నీవు, నేను తెలిసికొనవలసిన సంగతి ఏమనగా మనం క్రీస్తుయేసులో నూతన వ్యక్తులము. ఆయనలో నూతనమైన జీవితం కోసం పిలువబడ్డాము. మన పాత సంగతులను వదలిపెట్టుటకును క్రీస్తులో మనకు కల్గినదానిని ఉచితంగా పొంది నూతన జీవితంలో ఆనందించుటకు మనం భయపడకూడదు.

ప్రభువు నాతో "జాయిస్! పాతవి నిజంగా గతించిపోవుట, జీవితం నూతనమగుటయనునది క్రొత్త సృష్టికి పునాది కదా! పాతవి గతించెను; సమస్తము పూర్తిగా కొత్తవాయెను" అని చెప్పినప్పుడు ఈ సంగతులు నేను గ్రహించాను. మారుమనస్సు పొంది ప్రభువును అంగీకరించిన క్షణంలో ఈ సంగతి మనం గ్రహించలేము. కాని మనము ప్రభువులో సాగిపోయేకొలది మన జీవితశైలి నూతనమైనదిగా మారుతుంది.

## పాతవి గతించెను; ఇదిగో క్రొత్తవాయెను

"వీరందరు తమ విశ్వాసముద్వారా సాక్ష్యము పొందిన వారైనను, మనము లేకుండా సంపూర్ణులుకాకుండు నిమిత్తము, దేవుడు మనకొరకు మరి శ్రేష్ఠమైనదానిని ముందుగా సిద్ధపరచెను. గనుక వీరు వాగ్దానఫలము అనుభవింపలేదు."

హెబ్రీ 11:40

నీకు గతంలో కల్గియున్న దానితో, ఇప్పటిజీవితం పోల్చుకోకుండా ఉంటే, గతజీవితం అంత ఘోరమైన జీవితంగా కనబడదు.

హిందూ దేశంలో సువార్త పరిచర్య చేయుటకు మనము వెళ్లినప్పుడు, అక్కడి ప్రజల దుర్భరమైన జీవనస్థితిగతులు వారిని కలవరపరచేకంటే మనలనే ఎక్కువ కలవరపరుస్తాయి. ఎందుకంటే వారి జీవిత విధానాన్ని పోల్చుకునేందుకు వారికి మార్గంలేదు.

ఈ దినాలలో హిందూ దేశములోని ప్రజలలో మనము చూడగలిగేది, వారికెల్లప్పుడు ఉండే పరిస్థితులే. మనమెప్పుడు అమెరికాలో నివసిస్తాము. అమెరికా అంటే సమృద్ధియైన దేశము. కనుక మనము ఇండియాలోని పరిస్థితులను మన పరిస్థితులతో పోల్చుకుంటే అక్కడి ప్రజల పరిస్థితులు దుర్భరంగా కనిపిస్తాయి.

నీ పాత జీవిత విధానాన్ని మనస్సులో ఉంచుకొని అనుదినం, కృంగిపోయి, అడుగంటిన వారివలె, నిరుత్సాహముగా ఎందుకు జీవించాలి? నీ పాత జీవితం దేవుడు ఎప్పుడో తీసివేశాడుకదా!

నీవు పనిలేనివానివలె కూర్చుండి, గత సంగతులనే ఎందుకు మనస్కరిస్తు ఉంటావు? పూర్వకాలపు సంగతులను గూర్చి ఆలోచించవద్దు. పాత సంగతులు గతించిపోయి, క్రొత్తవైన, మెరుగైన సంగతులు మన అందుబాటులోనికి వచ్చాయి. ఈ సంగతి నీవెరుగాలి. ముందున్నవాటికొరకు వేగిరపడుము.

నిరాశ అనేది జీవితంలో కనబడే సత్యం. మరి నిరాశ కల్గినప్పుడు ఏమి చేయాలి? ఆ నిరాశ చిన్నదైనా లేక పెద్దదైనా సరే—అంటే వర్షం వచ్చి వనభోజనానికి వెళ్లకుండా చేసినట్లున్నప్పటికినీ లేక నిశ్చితార్థము జరుగకుండా అడ్డుపడినంత పెద్ద నిరాశ అయినప్పటికీ—అది రాతివలె నీపైనబడినప్పుడు, దానిచేత నీవు అణిగిపోవుటకైనా ఇష్టపడాలి, లేక శ్రేష్టమైన ఉన్నత జీవితమునకు ఆ పరిస్థితిని ఒక మెట్టుగానైనా నీవు ఉపయోగించుకోవచ్చు.

ఒకచోట కూర్చుండి, విరుద్ధమైన తలంపులతో నిండుకొని, మంచి ప్రోత్సాహకరమైన జీవితం నీవు జీవించలేవు. నీకు కల్గిన నిరాశలను గూర్చి

ఎంత ఎక్కువగా మదనపడితే అంత ఎక్కువగా నీవు నిరుత్సాహంలో జీవిస్తావు. నీవు అదేస్థితిలో కొనసాగుతూ ఉంటే గొప్ప అపాయము నీకు తటస్థిస్తుంది. అయితే దేవుడు నిన్ను అటువంటి దౌర్భాగ్యస్థితినుండి శ్రేష్టమైన దారికి నడిపించ గోరుతున్నాడు.

ఈ రోజు క్రొత్త రోజు. మళ్లీ నిరాశ నీ యొద్దకు వచ్చినట్లయిన, నూతన జీవితము వైపు మళ్లుకో. నూతన పరిస్థితికి అనుగుణ్యంగా జీవితాన్ని చక్కచేసి కొనుము. వెనుక ఉన్నవాటిని లక్ష్యపెట్టక ముందున్న వాటికొరకు వేగిరపడి సాగిపొమ్ము.

దేవుడు నీ జీవితంలో నూతన క్రియను చేయుచున్నాడని జ్ఞాపకముంచు కొనుము. గతాన్ని మరచి నూతన జీవితం తృప్తితో ఆనందంగా జీవించు. దేవుడే దానిని నీ కొరకు సిద్ధపరిచాడు.

# ముగింపు

“మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరుపారి స్థిరపడి...”

ఎఫెసీ 3:17

“నీ నిరీక్షణను ధైర్యముతో కూడిన నమ్మకమును దేనియందు కల్గియున్నావో జాగ్రత్తగా చూచుకొనుము.”

ఎఫెసీ 3:17లో ప్రేమయందు వేరుపారి స్థిరపడవలెనని హెచ్చరింపబడ్డాము. యేసుక్రీస్తు యొక్క ప్రేమలో మనము వేరుపారి స్థిరపడాలి. మనము ఇతరులయందు లేక మన పిల్లలయందు లేక మన స్నేహితులయందు లేక మన ఉద్యోగమందు వేరుపారవలెనని చెప్పబడలేదు.

యేసు గొప్పబండగా వర్ణింపబడ్డాడు. ఆయన చలించనివాడు. ఆ బండ చుట్టూ మన వేర్లు అల్లుకుంటే, మనకు కొద్దిపాటి నిరాశలు కల్గినప్పుడు ఫరవాలేదులే అనుకుంటాము. పెద్ద ఎత్తున నిరాశలు కల్గినప్పుడు, నీ భావోద్రేకములు అణపబడి, ఆయనలో ఇంకనూ కొనసాగిపోవుదువు.

యేసునందు గాక, వేరు దేనియందు నీవు వేరుపారి స్థిరపడినప్పటికీ, నీవు నిరాశతో, నిరుత్సాహంతో, కృంగుదలతో నాశనానికి చేరుదువు. ఎందుకంటే యేసు మాత్రమే చలించని బండయైయున్నాడు.

ఆయనతో సఖ్యపడి, సరిపడియుండు. ఆలాగు ఎందుకు చేయాలి? నీ స్వంత క్షేమము నిమిత్తమే ఆలాగు చేయాలి.

ఆ యా ప్రజలకు, పరిస్థితులకు అనుగుణ్యంగా మారి సర్దుకొనుట నీ ఆధిక్యతగా భావించు.

నీ జీవితములో సంభవించు నిరాశలను తలంచుకొని మదనపడుచు నీ జీవితము కొనసాగించకుము. నిరాశను వదలిపెట్టి దేవుడే నిన్ను కాపాడునట్లు ఆయన పరిపాలన క్రిందికి రమ్ము. నిరాశను ఆదిలోనే ఎదుర్కొని, పరిస్థితిని చక్కపరచుకొనుటకు తగినట్లుగా ప్రవర్తించు.

నీ సమస్యలపైననే మనస్సు కేంద్రీకరించక, నిరుత్సాహపడక, దేవుని వైపు నీ దృష్టి మళ్లించు. ఆయన వాగ్దానములను ధ్యానించుము. ఆయన వాక్యమును నోటితో బిగ్గరగా చెప్పుము. ప్రార్థనలో నీ పరిస్థితిని ప్రభువునకు వివరించుము.

నీవు పోగొట్టుకొనినవి, నీవు వదలివేసినవాటి జాబితాను వ్రాసికొనుము. ఆ విధంగా నీమనస్సు దేవునివైపు తిరుగుతుంది. యేసుప్రభువు “నేను ఉన్నాను” అన్న మాటలను జ్ఞాపకానికి తెచ్చుకో. “నేను ఇదివరకు ఉంటిని” అని ఆయన చెప్పలేదు. “ఇకముందు ఉంటాను” అని కూడా ఆయన చెప్పలేదు. ఆయన ఇప్పుడే నీకు అందుబాటులో సజీవుడుగా ఉన్నాడు. ఈ రోజు నుండి నీ జీవితంలో సంతోషంగా ఉండడానికి ప్రారంభించు.

*రెండవ భాగము*

# లేఖన భాగములు

# నిరుత్సాహమును ఎదిరించుటకు తగిన లేఖన భాగములు

"సజీవుల దేశమున నేను యెహోవా దయను పొందుదునన్న నమ్మకము నాకు లేనియెడల నేనేమవుదును?

యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము. ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా నుంచుకొనుము. యెహోవాకొరకు కనిపెట్టుకొని యుండుము."

కీర్తనలు 27:13,14

"సకల సంపూర్ణతకు పరిమితి కలదని నేను గ్రహించి యున్నాను. నీ ధర్మోపదేశము అపరిమితమైనది."

కీర్తనలు 119:96

"శ్రమకాలములో విశ్వాసఘాతకుని ఆశ్రయించుట విరిగిన పళ్ళతోను కీలు వసిలిన కాలుతోను సమానము."

సామెతలు 25:19

“నేను మిమ్మునుగూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణకలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు, ఇదే యెహోవా వాక్కు.”

యిర్మీయా 29:11

“అయినను యెహోవాకొరకు నేను ఎదురు చూచెదను, రక్షణకర్తయగు నా దేవునికొరకు నేను కనిపెట్టియుందును, నా దేవుడు నా ప్రార్థన నాలకించును.”

మీకా 7:7

“ఒకనితోనొకడు మనస్సుకలిసి యుండుడి. హెచ్చువాటియందు మనస్సుంచక తగ్గువాటియందు ఆసక్తులైయుండుడి. మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు.”

రోమా 12:16

“ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి పగతీర్చుట నా పని, నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది.”

రోమా 12:19

“మన ప్రభువైన యేసు క్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మతగినవాడు.”

1 కొరింథీ 1:9

“దేవుడు తన్ను ప్రేమించువారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరముకాలేదు.”

1 కొరింథీ 2:9

“మా ద్వారా ప్రతి స్థలమందును క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచు ఆయనయందు మమ్మును ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రము.”

2 కొరింథీ 2:14

“మనము మేలుచేయుట యందు విసుకక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగినకాలమందు పంటకోతుము.”

గలతీ 6:9

“తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను.”

ఎఫెసీ 1:5-6

"మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటి కంటెను, అత్యధికముగా చేయశక్తిగల దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక ఆమెన్."

ఎఫెసీ 3:20

"సహోదరులారా, మీరైతే విసుకవద్దు."

2 థెస్స 3:13

# నిరుత్సాహమును జయించుటకు ప్రార్థన

*"తండ్రీ, నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది.*

*నావంటి మనుష్యులపై, నా నిరీక్షణను గాని, నా ఆశలను గాని పెట్టుకొనకుండా కాపాడండి.*

*ఎందుకంటే మేమందరము ఒకరినొకరము నిరాశ పరచుకొనేవారము.*

*ప్రభువా, నేను మరి ఎక్కువగా నీవలెనుండుటకు, నా వలె ఉండకుండుటకు సాయం చేయండి."*

*ఈ మనవులన్నీ యేసు పరిశుద్ధనామమున అడుగుచున్నాను, ఆమేన్.*

# ప్రభువుతో వ్యక్తిగతమైన సంబంధం కొరకు ప్రార్థన

సమాధానకర్తయైన యేసుప్రభువును నీవు ఇంతవరకు నీ స్వంతరక్షకునిగా, ప్రభువుగా అంగీకరించకపోతే, ఈ క్రిందివిధంగా నీవు ప్రార్థించుము. క్రీస్తులో నూతనమైన జీవితమును నీవు అనుభవించగలవు.

*"తండ్రీ,*

*నీవు లోకమును ప్రేమించి నీ అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించితివి.*

*మేము కృపద్వారానే విశ్వాసమువలన రక్షణ పొందితిమని నీ వాక్యము వెల్లడించు చున్నది. రక్షణను సంపాదించుకొనుటకు మేమేమియు చేయలేము.*

*నీ కుమారుడైన యేసుక్రీస్తు లోకరక్షకుడని నా నోటితో ఒప్పుకొనుచూ విశ్వసించుచున్నాను. ఆయన సిలువపై నా కొరకు చనిపోయి నా పాపమంత తనమీద మోపుకొన్నాడని వాటి క్రయమంతా చెల్లించాడని, ఆయన చనిపోయిన తరువాత మీరు ఆయనను లేపినారని నమ్ముచున్నాను.*

*నా పాపములు క్షమించుమని మనవి చేయుచున్నాను. యేసును నా ప్రభువుగా ఒప్పుకొనుచున్నాను. నీ వాక్యమునందు తెలియజేయబడిన రీతిగా నేనిప్పుడు రక్షణ పొందితిని. నిత్యత్వము నీతోనే గడుపుదును. తండ్రీ నీకు వందనములు. నీకు నేను కృతజ్ఞుడను. యేసు నామమందు అడుగుచున్నాను." ఆమెన్.*

ఈ క్రింది వచనాలు చదవండి. యోహాను 3:16; ఎఫెసీ 2:8, 9; రోమా 10:9,10; 1 కొరింథీ 15:3, 4; 1 యోహాను 1:9; 4:14,16; 5:1, 12, 13.

# రక్షణ కొరకు ప్రార్థన

దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు మరియు ఆయన నీతో వ్యక్తిగత సంబంధమును కలిగియుండాలని ఆశిస్తున్నాడు. నీవు ఇంకను యేసును నీ స్వంతరక్షకునిగా అంగీకరించని యెడల ఇప్పుడే దానిని చేయుము. మీరు కేవలం మీ హృదయమును ఆయన కొరకు తెరచి ఈ ప్రార్థనను చేయుము.

"తండ్రీ, నేను నీకు వ్యతిరేకముగా పాపము చేసియున్నానని నాకు తెలియును. నన్ను క్షమించుము. నన్ను శుద్ధునిగా చేయుము. నేను మీ కుమారుడైన యేసులో నమ్మికయుంచుదునని వాగ్దానం చేయుచున్నాను. ఆయన నాకొరకు మరణించియున్నాడని – ఆయన సిలువపై మరణించినప్పుడు నా పాపములన్నింటిని ఆయన మోసాడని నేను నమ్మెదును. ఆయన మరణము జయించి తిరిగి లేచాడని నేను నమ్ముచున్నాను. నేను ఇప్పుడే నా జీవితమును యేసుకు అర్పించుచున్నాను.

తండ్రీ, మీ క్షమాపణ మరియు నిత్యజీవమనే బహుమతులను బట్టి మీకు వందనము. నీ కొరకు జీవించుటకు నాకు సహాయం చేయుము. యేసు నామములో ప్రార్థించుచున్నాను. ఆమేన్."

నీవు నీ హృదయముతో ప్రార్థించినప్పుడు దేవుడు నిన్ను అంగీకరించి, పరిశుద్ధ పరచి మరియు ఆత్మీయ మరణమనే బంధకము నుండి నిన్ను విడిపించెను,

సమయం తీసుకొని ఈ లేఖనమును చదివి మరియు ధ్యానించి మరియు మీ నూతన జీవితంలో ఆయనతో నడచుచున్న ఈ ప్రయాణంలో దేవుడు మీతో మాట్లాడునట్లు ఆయనను అడుగుము.

- యోహాను 3:16
- 1 కొరింథీ 15:3-4
- ఎఫెసీ. 1:4
- ఎఫెసీ 2:8-9
- 1 యోహాను 1:9
- 1 యోహాను 4:14-15
- 1 యోహాను 5:1
- 1 యోహాను 5:12-13

నీవు క్రీస్తుతో నీ సంబంధముతో ఎదుగుటకు ప్రోత్సహించబడునట్లుగా బైబిలును నమ్మే సంఘమును మీరు కనుగొనునట్లు దేవుని సహాయం కొరకు అడగండి. దేవుడెల్లప్పుడు మీతోనే ఉంటాడు మరియు దేవుడు మీ కొరకు దాచియుంచిన సమృద్ధియైన జీవితమును మీరు జీవించునట్లు ఆయన మిమ్ములను నడిపించును.

# రచయితను గురించి

జాయిస్ మేయర్ ప్రపంచంలోని ప్రసిద్ధిగాంచిన క్రియాపూర్వకమైన బైబిల్ బోధకులలో ఒకరు, ఆనందించుడి ప్రతిదిన జీవితం అనే ఆమె టివి మరియు రేడియో కార్యక్రమాలు ప్రపంచమంతటా వందలకొలది టివి నెట్‌వర్క్ మరియు రేడియో స్టేషన్స్‌లో ప్రసారమవుతుంది.

జాయిస్ వందల కంటే ఎక్కువ ఉత్తేజకరమైన పుస్తకాలను రచించారు. ఆమె పుస్తకాలలో ఉత్తమంగా అమ్ముడైన పుస్తకాలు – *గాడ్ ఈస్ నాట్ మ్యాడ్ ఎట్ యు; మేకింగ్ గుడ్ హ్యాబిట్స్, బ్రేకింగ్ బ్యాడ్ హ్యాబిట్స్; డు యువర్ సెల్ఫ్ ఎ ఫేవర్... ఫర్‌గివ్; లివింగ్ బియాండ్ యువర్ ఫీలింగ్స్; పవర్ థాట్స్; మనస్సే ఒక రణరంగం; లుక్ గ్రేట్ ఫీల్ గ్రేట్; ద కాన్ఫిడెంట్ వుమన్; ఐ డేర్ యు; మరియు నెవర్ గివ్ అప్!*

జాయిస్ ప్రపంచమంతటా అనేకమంది వేలమంది ప్రజలతో మాట్లాడునట్లు సంవత్సరమంతటా సదస్సులను నిర్వహిస్తూ విస్తారంగా ప్రయాణిస్తూ ఉంటారు.

Joyce Meyer Ministries—India
Post Bag No. 1
Jubilee Hills, Hyderabad
India
www.jmmindia.org

**Go to tv.joycemeyer.org to watch Joyce's messages in a variety of different languages.**

**You can also request Prayer on Toll Free number: 1800 3454 007**

## నిరీక్షణకల్గియుండు, ధైర్యము వహించు, నీవు నిరుత్సాహపడనక్కరలేదు!

మన పథకం ప్రకారం పనులు జరుగకపోతే మనము నిరాశపడిపోతాము. మనమన్ని విషయాల్లో తప్పటడుగులేస్తున్నామని, మన ఆశలన్నీ భగ్నమైపోయినవని తలస్తాము. అటువంటప్పుడు నిరాశ కల్గినప్పుడు వెంటనే తగు చర్య తీసుకోకపోతే, మనలను నిరుత్సాహంలోనికి, ఆ తరువాత కృంగుదలలోనికి మనలను నడిపించుటకు సాతానుకు వీలు కల్పించినవారమగుదుము.

ఎక్కువ అమ్ముడుబోయే పుస్తకములు రచించిన రచయిత్రి, జాయిస్ మేయర్. లేఖనముల ఆధారంగా ఆమె ప్రతిపాదించిన శక్తివంతమ్కైన సత్యములు దైవోగ్రతకు సాతాను పీడనకు మధ్య వ్యత్యాసమును తెలిసికొనుటకు ఉపయోగించును.

ప్రారంభదశలోనే సాతాను యొక్క శోధనను ఎదిరించుటకు ఆ సత్యములు సాయపడును. నిరాశను విజయానికి ఎట్లు మలుచుకోవాలో మనము తెలిసికొనుటకు వీలగును.

జీవితమనే యాత్రలో త్రోవ ప్రక్కన పడిపోయిన క్రైస్తవుడవై వేదనలో జీవించవద్దు. యేసుక్రీస్తునందు మనకు అందుబాటులోనున్న అధికారమునుపయోగించుకొని ఈ రోజే సాతానును ఎదిరించుము.

---

### ఈ వరుసలోని ఇతర పుస్తకములు చదవండి

- *కృంగినతనమును గూర్చి ముక్కుసూటి మాట*
- *ఒంటరితనము గూర్చి ముక్కుసూటి మాట*
- *భయమును గూర్చి ముక్కుసూటి మాట*
- *మానసిక ఒత్తిడిని గూర్చి ముక్కుసూటి మాట*
- *అభద్రతా భావమును గూర్చి ముక్కుసూటి మాట*
- *చింతించుటను గూర్చి ముక్కుసూటి మాట*

JOYCE MEYER MINISTRIES®
Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033